



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 355 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : ఒంగోలు మంగళవారం 25 ఆగస్టు 2026 వెల : 1/-రూ ॥
VOLUME :1 ISSUE :355 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : ONGOLE TUE 25 AUGUST 2026 PRICE : 1/- RS
Simultaneously Published form Ongole,Visakhapatnam,Kakinada,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur

## కెనడా దిగుమతులపై 50 శాతం సుంకాలు..
## ట్రంప్ సంచలన నిర్ణయం



- వచ్చే ఏడాది జనవరి 1 నుంచి కొత్త టారిఫ్‌లు అమలు
- కెనడా వల్లే తమకు వాణిజ్య లోటు వస్తోందన్న ట్రంప్
- అమెరికా నిర్ణయంపై ప్రతీకార చర్యలకు కెనడా సిద్ధం

**పెన్ పవర్ డెస్క్:**అమెరికా, కెనడా దేశాల మధ్య నెలకొన్న వాణిజ్య యుద్ధం మరింత తీవ్రరూపం దాల్చింది. కెనడా నుంచి దిగుమతి అయ్యే కార్లు, ట్రక్కులు, వాహన విడిభాగాలు, ఉక్కుపై ఏకంగా 50 శాతం మేర సుంకాలను విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. ఈ కొత్త టారిఫ్‌లు

- మిగతా 2లో

## ఉద్యోగాలు భర్తీ చేయకుండా రిజర్వేషన్లకు ఎసరు



- రిజర్వేషన్లను కేంద్రం పరోక్షంగా నిర్వీర్యం చేస్తోందన్న ఖర్గే
- లక్షల కొద్దీ ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయడం లేదని ఆరోపణ
- రాజ్యాంగ సవరణ లేకుండానే రిజర్వేషన్లు ఎత్తేస్తున్నారని విమర్శ
- వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టుల వివరాలు వెల్లడి
- శాశ్వత ఉద్యోగాలు తగ్గించి కాంట్రాక్టు విధానం పెంచుతున్నారని ఆందోళన

**పెన్ పవర్ డెస్క్:**కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయకుండా, లక్షలాది పోస్టులను ఖాళీగా ఉంచడం ద్వారా రిజర్వేషన్లను పరోక్షంగా నిర్వీర్యం చేస్తున్నారని ఆయన ఆరోపించారు.

- మిగతా 2లో



## ఏపీలో ఇన్-సర్వీస్ టీచర్లకు
# ప్రత్యేక టెట్..


- ఏపీలో ఇన్-సర్వీస్ టీచర్ల కోసం స్పెషల్ టెట్ నోటిఫికేషన్ జారీ
- సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం టెట్ అర్హత సాధించేందుకు అవకాశం
- ఆగస్టు 25 నుంచి సెప్టెంబర్ 24 వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు
- అక్టోబర్ 11 నుంచి కంప్యూటర్ ఆధారిత విధానంలో పరీక్షలు
- ఈ అర్హత ప్రత్యక్ష నియామకాలకు వర్తించదని స్పష్టీకరణ

**పెన్ పవర్ డెస్క్:**ఏపీలో ఇన్-సర్వీస్ టీచర్ల కోసం ప్రత్యేక టెట్ నోటిఫికేషన్ విడుదలైంది. ఆగస్టు 25 నుంచి సెప్టెంబర్ 24వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేశ్ సూచించారు. ఈ పరీక్షలు అక్టోబర్ 11 నుంచి 21వ తేదీ వరకు జరుగుతాయని పేర్కొంటూ 'ఎక్స్'వేదికగా పోస్టు పెట్టారు. రాష్ట్రంలోని ప్రభుత్వ యాజమాన్యం (ప్రభుత్వ /

- మిగతా 2లో

## ఫుడ్ ప్రాసెసింగ్‌తో పంటలకు విలువ..
# ప్రపంచ మార్కెట్లే లక్ష్యం

- దేశీయ పాప్‌కార్న్ విత్తనాలను ఆవిష్కరించిన ఉపరాష్ట్రపతి, సీఎం
- ఫుడ్ ప్రాసెసింగ్‌తో వ్యవసాయ ఉత్పత్తులకు విలువ జోడింపు
- ఆంధ్రా పాప్‌కార్న్, అరకు కాఫీలను గ్లోబల్ బ్రాండ్లుగా తీర్చిదిద్దడమే లక్ష్యం
- రాయలసీమను ఉద్యాన హబ్‌గా మార్చేందుకు భారీ ప్రణాళిక
- నదుల అనుసంధానంతో నీటి భద్రత సాధిస్తామన్న చంద్రబాబు



**పెన్ పవర్ డెస్క్:**వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తులకు ఫుడ్ ప్రాసెసింగ్ ద్వారా విలువ జోడించి, అంతర్జాతీయ మార్కెట్లకు ఎగుమతి చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు పునరుద్ఘాటించారు. ఫుడ్ ప్రాసెసింగ్ ప్రక్రియతో ఉత్పత్తుల విలువ పెరిగి, రైతులకు ప్రయోజనం కలగడమే కాకుండా రాష్ట్రంలో సంపద సృష్టి జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. సోమవారం ఏలూరు జిల్లా ముసునూరు వద్ద ఏర్పాటు చేసిన 'గార్మే పాప్ కార్నికా' నాన్-జీఎంఓ హైబ్రీడ్ మొక్కజొన్న విత్తనాలను ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో కలిసి ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. అనంతరం దేశంలోనే అతిపెద్ద పాప్‌కార్న్ ప్రాసెసింగ్ యూనిట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో చంద్రబాబు మాట్లాడుతూ.. "రైతులపై ఉన్న ప్రేమతో ఉపరాష్ట్రపతి ఏలూరు జిల్లాకు వచ్చి జన్యుమార్పిడి చేయని మొక్కజొన్న విత్తనాలను ఆవిష్కరించారు. గార్మే పాప్ కార్న్ సంస్థ మన దేశీయ నేలపైనే రైతులతో కలిసి నాన్-జీఎంఓ విత్తనాలను ఉత్పత్తి చేయడం అభినందనీయం. నూజివీడు గడ్డపై పండిన

- మిగతా 2లో

## రామోజీపై విమర్శలా?
# ముందు పోలవరం సంగతి చెప్పు!
### అంబటికి మంత్రి నిమ్మల కౌంటర్



- రామోజీరావును విమర్శించడం ఆకాశంపై ఉమ్మేయడమేనన్న మంత్రి నిమ్మల
- నైతికత లేని అంబటి రాంబాబు ఆ అర్హత కోల్పోయారని ఘాటు వ్యాఖ్యలు
- మార్గదర్శి కేసులో సుప్రీంకోర్టు తీర్పును గుర్తు చేసిన మంత్రి
- పోలవరం వైఫల్యంపై అంబటి సమాధానం చెప్పాలని డిమాండ్
- రామోజీ స్థాయికి, వైసీపీ నేతల స్థాయికి నక్కకూ నాగలోకానికీ ఉన్నంత తేడా అని ఫైర్

- మిగతా 2లో

## ప్రభుత్వ ఆఫీసులు చుట్టూ తిరగాల్సిన పని లేకుండా..
# టెక్నాలజీతోనే సేవలు



- టెక్నాలజీతో ప్రభుత్వ సేవలు మరింత సులభతరం
- సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు డేటా ఇంటిగ్రేషన్ విధానం
- ఎల్‌నినో ప్రభావం.. పంటల దిగుబడిపై సమీక్ష
- డెంగీ, మలేరియా నివారణకు హాట్‌స్పాట్‌ల గుర్తింపు
- శాఖల్లో సమర్థత, సేవల నాణ్యత పెంచాలని సీఎం ఆదేశం

**పెన్ పవర్ డెస్క్:**ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత సులభంగా, వేగంగా అందాలని, ఇందుకోసం ఏఐ అసిస్టెంట్, బ్లాక్ చెయిన్ వంటి అత్యాధునిక టెక్నాలజీని వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఏ ఒక్కరూ ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేని విధంగా పాలన ఉండాలని స్పష్టం చేశారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కోసం పదేపదే వాటిని అప్‌లోడ్ చేసే పనిలేకుండా 'డేటా ఇంటిగ్రేషన్'

- మిగతా 2లో



## మతం మారాలని సౌజన్యపై సాధిక్ ఒత్తిడి తెచ్చాడు
### కాకినాడ ఎస్పీ

**పెన్ పవర్ డెస్క్:** ఏఈ నూకరాజు కుటుంబం సామూహిక ఆత్మహత్య కేసులో దర్యాప్తు కొనసాగుతోందని కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్ తెలిపారు. నూకరాజు, ఆయన కుమార్తె సౌజన్య వేర్వేరుగా రాసిన సూసైడ్ నోట్‌లను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఈ రెండింటిలోనూ రైఫిల్ షూటింగ్ కోచ్ సాధిక్‌ఖాన్

- మిగతా 2లో

## మాట తప్పారంటూ కేంద్రంపై సీజేపీ ఆగ్రహం..
# సెప్టెంబర్ 5న భారీ నిరసన

- సెప్టెంబర్ 5న ఢిల్లీలో నిరసన చేపట్టనున్న సీజేపీ
- ఇచ్చిన హామీలను కేంద్రం నెరవేర్చలేదని ఆరోపణ
- నీట్ మృతుల కుటుంబాలు, విద్యార్థులతో కలిసి ఆందోళన
- ప్రభుత్వం తమను మోసం చేసిందని ప్రకటన
- జూలై 25న ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని డిమాండ్



**పెన్ పవర్ డెస్క్:**కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా మరోసారి ఆందోళన బాట పట్టాలని నిర్ణయించింది. కేంద్రం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ, సెప్టెంబర్ 5న ఢిల్లీలో శాంతియుత నిరసన ప్రదర్శన నిర్వహించనున్నట్లు ప్రకటించింది. నీట్ పరీక్షల

- మిగతా 2లో

## రాజకీయ సన్యాసం ప్రసక్తే లేదు

- బీజేపీని కనుమరుగు చేసే వరకు విశ్రమించనని శపథం
- జనగణన పేరుతో ఎన్ఆర్సీ అమలుకు కుట్ర అని ఆరోపణ
- అన్నపూర్ణ భండార్ పథకంపై ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్
- ఓటర్ల తొలగింపుపై సుప్రీంకోర్టును ఆశ్రయిస్తానని వెల్లడి

- మిగతా 2లో



## విజయ్ నిర్ణయం.. ఇతర రాష్ట్రాలకు జాక్‌పాట్

**పెన్ పవర్ డెస్క్:** తమిళనాడులోని పరందూర్‌లో కొత్తగా నిర్మించతలపెట్టిన గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయ ప్రాజెక్టును ముఖ్యమంత్రి విజయ్ పక్కనపెట్టడాన్ని డీఎంకే చీఫ్ ఎంకే స్టాలిన్ ఖండించారు. ఆ ప్రాజెక్టు కోసం భూసేకరణ ప్రక్రియ పూర్తయిందని గుర్తుచేస్తూ.. సంకుచిత రాజకీయాల కోసం రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టలేమని ధ్వజమెత్తారు. డీఎంకే హయాంలో రూపొందించిన ఈ ప్రాజెక్టు ప్రతిపాదనను తిరస్కరించడాన్ని.. రాష్ట్ర అభివృద్ధికి కోలుకోలేని ఎదురుదెబ్బగా పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నిర్ణయం..

- మిగతా 2లో



# ఫుడ్ ప్రాసెసింగ్‌తో పంటలకు విలువ.. ప్రపంచ మార్కెట్లే లక్ష్యం

- మొదటి పేజి తరువాయి

ఈ పాప్‌కార్న్ దేశవిదేశాలకు ఎగుమతి కావడం గర్వకారణం” అని అన్నారు. 17,500 మంది రైతులతో 40 వేల ఎకరాల్లో ఈ పంటను సాగు చేస్తూ, దేశీయ పాప్‌కార్న్ ఉత్పత్తిలో 70 శాతం వాటాను కలిగి ఉండటంపై గార్మె సంస్థను ఆయన ప్రశంసించారు. ఇప్పటివరకు పాప్‌కార్న్ కోసం బ్రెజిల్ వంటి దేశాలపై ఆధారపడ్డామని, ఇకపై ఆ సంపద మన దేశంలోనే ఉంటుందని తెలిపారు.

**గ్లోబల్ బ్రాండ్లుగా మన ఉత్పత్తులు**

“ఆంధ్రా పాప్‌కార్న్, అరకు కాఫీ, కోస్తా కోకో వంటివి ప్రపంచ ప్రసిద్ధి చెందిన బ్రాండ్లుగా మారాలి. రైల్వే స్టేషన్లలోనూ వీటి కౌంటర్లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటాం. కొండపల్లి కొయ్యబొమ్మల వంటి స్వదేశీ ఉత్పత్తులు ప్రపంచ మార్కెట్లకు చేరాలి. కేంద్ర, రాష్ట్రాల్లోని ఎన్డీఏ ప్రభుత్వాలు వ్యవసాయాన్ని ఆర్థిక శక్తిగా, రైతులను పారిశ్రామికవేత్తలుగా చూస్తున్నాయి. పసుపు, మిరప, ఆక్వా ఉత్పత్తులకు విలువ జోడించి ఎగుమతి చేయడమే మా లక్ష్యం” అని చంద్రబాబు వివరించారు. ప్రస్తుతం రాష్ట్రంలో కేవలం 10 శాతం ఉత్పత్తులు మాత్రమే ప్రాసెస్ అవుతున్నాయని, ఈ శాతాన్ని పెంచడం ద్వారా అధిక సంపదను ఆర్జించవచ్చని అన్నారు. ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్త రావాలని, ముఖ్యంగా యువత ఈ రంగంపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు.

**రాష్ట్ర సమగ్రాభివృద్ధికి జల భద్రతే కీలకం**

రాష్ట్ర అభివృద్ధి ప్రణాళికల గురించి వివరిస్తూ.. “రాయలసీమను ఉద్యాన పంటల హబ్‌గా మార్చేందుకు కార్యాచరణ సిద్ధం చేశాం. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో రూ.1 లక్ష కోట్ల పెట్టుబడులతో సీమను అభివృద్ధి చేస్తాం. రూ.35 వేల కోట్లతో 36 సాగునీటి ప్రాజెక్టులను ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేస్తాం” అని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఈ నెలాఖరులో వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభించి ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాలకు నీరందిస్తామన్నారు. ఈ ఏడాది ఎల్ నినో ప్రభావం ఉన్నప్పటికీ గోదావరి నీటిని కృష్ణా డెల్టాకు తరలించి పంటలను కాపాడామని గుర్తుచేశారు. చింతలపూడి ప్రాజెక్టు పూర్తయితే ఈ ప్రాంత భవిష్యత్తు మారుతుందని ధీమా వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా నదుల అనుసంధానం జరగాలన్నది ఎన్డీఏ ప్రభుత్వ ఆలోచన అని ముఖ్యమంత్రి తెలిపారు. “గోదావరి–కృష్ణా, తుంగభద్ర, పెన్నా–కావేరీ నదుల అనుసంధానంతో 4 రాష్ట్రాల్లో నీటి సమస్యలు తీరతాయి. గంగ, మహానది, గోదావరి నదులను కూడా కలిపితే వేల టీఎంసీల నీటిని సద్వినియోగం చేసుకోవచ్చు. నీటి భద్రత సాధిస్తే దేశాభివృద్ధి అన్‌స్టాపబుల్” అని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నారా లోకేశ్, కె. అచ్చెన్నాయుడు, కొలుసు పార్థసారథి, పలువురు ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

# రామోజీపై విమర్శలా? ముందు పోలవరం సంగతి చెప్పు!

వైసీపీ నేత అంబటి రాంబాబుపై రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పద్మవిభూషణ్ పురస్కార గ్రహీత, లక్షలాది మందికి ఉపాధి కల్పించిన రామోజీరావు గారిని విమర్శించడం ఆకాశంపై ఉమ్మివేయడమేనని ఘాటుగా వ్యాఖ్యానించారు. నైతికత గురించి మాట్లాడే అర్హతే లేని అంబటి రాంబాబు, రామోజీరావు వంటి మహనీయుడిపై విమర్శలు చేయడం హాస్యాస్పదమని దుయ్యబట్టారు. ఈనాడు, రామోజీ ఫిల్మ్ సిటీ, ఉషాకిరణ్ మూవీస్ వంటి సంస్థల ద్వారా తెలుగు వారి ప్రతిభను ప్రపంచానికి చాటిచెప్పిన రామోజీరావు సేవలను మంత్రి నిమ్మల గుర్తుచేశారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం నుంచి జగన్ పాలన వరకు, ప్రజా సమస్యలపై గళమెత్తినందుకే రామోజీరావుపై, ఆయన సంస్థలపై రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఎన్ని కేసులు పెట్టి వేధించినా ఆయన న్యాయపోరాటం చేసి నిలిచారని అన్నారు. మార్గదర్శి వ్యవహారంలో ఉండవల్లి అరుణ్‌కుమార్ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పును ప్రస్తావిస్తూ, న్యాయస్థానం ఇచ్చిన స్పష్టతను రాజకీయ ప్రయోజనాల కోసం వక్రీకరించవద్దని హితవు పలికారు. 2006లో మార్గదర్శిపై వివాదాలు సృష్టించినప్పుడు డిపాజిట్‌దారుల ప్రయోజనాలే పరమావధిగా భావించి, తన సొంత ఆస్తులను సైతం పణంగా పెట్టి చెల్లింపులు జరిపిన ఆయన విశ్వసనీయతను గుర్తుంచుకోవాలని అన్నారు. చిరునామాలు సరిగా లేని కారణంగా చెల్లించలేని డిపాజిట్లను కూడా ఎస్క్రో ఖాతాల్లో భద్రపరిచారని తెలిపారు. ఇంతటి నిజాయతీపరుడిని విమర్శించే ముందు, గత ప్రభుత్వంలో తన శాఖ పనితీరుపై అంబటి ఆత్మపరిశీలన చేసుకోవాలని నిమ్మల హితవు పలికారు. “జలవనరుల శాఖ మాజీ మంత్రిగా, పోలవరం ప్రాజెక్టును ఎందుకు పూర్తి చేయలేకపోయారో అంబటి రాంబాబు ప్రజలకు సమాధానం చెప్పాలి. తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి, ప్రజాపక్షం వహించిన ఒక గొప్ప వ్యక్తిపై బురద చల్లడం ఎంతవరకు సమంజసం?” అని నిమ్మల ప్రశ్నించారు. రామోజీరావు గారి స్థాయికి, వైసీపీ నేతల స్థాయికి నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా ఉందని, ఎవరు ప్రజల కోసం నిలబడ్డారో, ఎవరు అధికారాన్ని అడ్డుపెట్టుకుని విఫలమయ్యారో ప్రజలు గమనిస్తున్నారని ఆయన అన్నారు. అంబటి వంటి వారి విమర్శలు రామోజీరావుపై ప్రజల్లో ఉన్న విశ్వాసాన్ని ఏమాత్రం తగ్గించలేవని నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు.

# రాజకీయ సన్యాసం ప్రసక్తే లేదు

తాను రాజకీయాల నుంచి వైదొలిగే ప్రసక్తే లేదని తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్పష్టం చేశారు. బీజేపీని అధికార పీఠం నుంచి దించే వరకు తన పోరాటం ఆగదని ఆమె తేల్చిచెప్పారు. సోమవారం ఆన్‌లైన్ వేదికగా నిర్వహించిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న ఆమె, బీజేపీ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో అధికార మార్పిడి జరిగిన నాలుగు నెలల్లోనే బీజేపీ అసలు స్వరూపం ప్రజలకు అర్థమైందని ఆమె పేర్కొన్నారు. ఎన్ఆర్‌సీ అమలు చేసేందుకే కేంద్ర ప్రభుత్వం జనగణనను ఒక సాకుగా వాడుకుంటోందని ఆరోపించారు. జనగణన దరఖాస్తులపై సంతకాలు చేసే సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ‘అన్నపూర్ణ భండార్’ పథకం కింద ఆర్థిక సాయం అందడంలో జాప్యం జరుగుతోందని, అనర్హత సాకుతో లబ్ధిదారుల సంఖ్యను కుదించడం ఎన్నికల వాగ్దానాలను ఉల్లంఘించడమేనని ఆమె విమర్శించారు. ఇటీవల

జాదవ్‌పూర్ విశ్వవిద్యాలయంలో ఏబీవీపీ, వామపక్ష విద్యార్థి సంఘాల మధ్య చోటుచేసుకున్న ఘర్షణల వెనుక బీజేపీ హస్తం ఉందని ఆమె ఆరోపించారు. క్యాంపస్‌లలో హింసను ప్రేరేపిస్తూ విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారని దుయ్యబట్టారు. ఎస్ఐఆర్ ప్రక్రియ ద్వారా లక్షలాది మంది అర్హులైన ఓటర్ల పేర్లను జాబితా నుంచి తొలగించారని, వారి పేర్లను తిరిగి చేర్చేందుకు అవసరమైతే మళ్లీ సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని మమతా బెనర్జీ స్పష్టం చేశారు.

# కెనడా దిగుమతులపై 50 శాతం సుంకాలు.. ట్రంప్ సంచలన నిర్ణయం

- మొదటి పేజి తరువాయి

2027 జనవరి 1 నుంచి అమల్లోకి వస్తాయని ఆయన స్పష్టం చేశారు. తమ దేశ వ్యవసాయ ఉత్పత్తులపై కెనడా అధిక సుంకాలను విధిస్తోందని, దీనివల్ల అమెరికా రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని ట్రంప్ ఆరోపించారు. కెనడా వైఖరి కారణంగానే తమకు 60 బిలియన్ డాలర్ల వాణిజ్య లోటు ఏర్పడిందని ఆయన మండిపడ్డారు. ఇకపై కెనడాను ప్రత్యేక దేశంగా పరిగణించబోమని, వాణిజ్య వ్యవహారాల్లో ఆ దేశంతో కలిసి ముందుకు సాగడం కష్టంగా మారిందని వ్యాఖ్యానించారు. కెనడా వాణిజ్యంలో 95 శాతం వాటా అమెరికాతోనే ముడిపడి ఉందని, తమతోనే ఆ దేశానికి అత్యధిక అవసరం ఉందని ట్రంప్ పేర్కొన్నారు. అయితే, అమెరికాలో తయారైన వస్తువులకు మాత్రం ఈ సుంకాల నుంచి మినహాయింపు ఉంటుందని ఆయన వెల్లడించారు.

ఇరు దేశాల మధ్య ఇటీవల జరిగిన వాణిజ్య చర్చలు విఫలమవ్వడంతోనే ట్రంప్ ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ట్రంప్ నిర్ణయంపై కెనడా ప్రధాని మార్క్ కార్నీ తీవ్రంగా స్పందించారు. అమెరికాపై ప్రతీకార సుంకాలను విధిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ సుంకాలు సెప్టెంబర్ 8 నుంచే అమల్లోకి వస్తాయని ఆయన వెల్లడించారు. ఇప్పటికే కెనడాకు చెందిన 20 బిలియన్ డాలర్ల విలువైన వస్తువులపై అమెరికా 50 శాతం సుంకాలను విధించిన నేపథ్యంలో, తాజా పరిణామాలతో ఇరు దేశాల మధ్య వాణిజ్య పోరు మరింత ముదిరే అవకాశం ఉంది.

### ప్రభుత్వ ఆఫీసులు చుట్టూ తిరగాల్సిన పని లేకుండా..

# టెక్నాలజీతోనే సేవలు

- మొదటి పేజి తరువాయి

విధానాన్ని అమలు చేయాలని సూచించారు. సోమవారం సచివాలయంలో ఆర్టీజీఎస్‌పై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని శాఖలు తమ సమర్థతను పెంచుకుని, నాణ్యమైన సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రాష్ట్రంలో వ్యవసాయ రంగం పరిస్థితిని అధికారులు సీఎంకు వివరించారు. ఈసారి పంటల దిగుబడి సాధారణం కన్నా 20 శాతం తగ్గే అవకాశం ఉందని అంచనా వేశారు. కృష్ణా డెల్టాకు సెప్టెంబర్ నెలాఖరు వరకు పట్టిసీమ ద్వారా నీరందించగలమని తెలిపారు. దీనిపై స్పందించిన సీఎం, ప్రస్తుతం సాగులో ఉన్న పంటలకు నీటి కొరత లేకుండా చూడాలన్నారు. సాగు ప్రారంభించని చోట్ల వరికి బదులు ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలని ఆదేశించారు. రైతులకు పంపే క్రాప్ అలర్ట్‌లపై తీసుకుంటున్న చర్యలను కూడా పర్యవేక్షించాలని, తాగునీటికి ఎలాంటి ఇబ్బంది రాకుండా చూడాలని స్పష్టం చేశారు. అలాగే, ప్రజారోగ్యంపై కూడా ముఖ్యమంత్రి సమీక్షించారు. రాష్ట్రంలో డెంగీ, మలేరియా వ్యాధుల నివారణకు వ్యాధి ప్రబలుతున్న హాట్‌స్పాట్‌లను గుర్తించి, తక్షణ నియంత్రణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అయితే, గతేడాదితో పోలిస్తే ఈసారి డెంగీ కేసులు గణనీయంగా తగ్గాయని అధికారులు వివరించారు. గత ఏడాది ఇదే సమయానికి 1,361 కేసులు నమోదు కాగా, ఈ ఏడాది ఇప్పటివరకు 401 కేసులు మాత్రమే నమోదైనట్టు తెలిపారు. రాష్ట్రాన్ని కార్బన్ న్యూట్రల్ లక్ష్యం వైపు నడిపించాలని సీఎం ఆకాంక్షించారు. ఇందుకోసం పునరుత్పాదక ఇంధన వనరులపై, ముఖ్యంగా సోలార్ రూఫ్ టాప్‌ల ఏర్పాటుపై దృష్టి సారించి, ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని అధికారులకు సూచించారు.

### మాట తప్పారంటూ కేంద్రంపై సీజేపీ ఆగ్రహం..

# సెప్టెంబర్ 5న భారీ నిరసన

- మొదటి పేజి తరువాయి

నేపథ్యంలో మరణించిన విద్యార్థుల కుటుంబాలు, పోలీసుల వేధింపులకు గురైన బాధితులతో కలిసి ఈ ర్యాలీ చేపట్టనున్నట్లు వెల్లడించింది. ఈ నిరసన ర్యాలీ సెప్టెంబర్ 5న ఇండియా గేట్ నుండి ఢిల్లీలోని నూతన పోలీస్ హెడ్ క్వార్టర్స్ వరకు కొనసాగనుంది. జూలై 25న ప్రభుత్వం ఇచ్చిన హామీలను పరిగణనలోకి తీసుకుని తాము దేశవ్యాప్త నిరసనలను విరమించుకున్నామని, అయితే ఇప్పుడు ప్రభుత్వం మాట తప్పిందని సీజేపీ ఆరోపించింది. ఇది యువతను, బాధితుల కుటుంబాలను వంచించడమేనని పార్టీ తన ప్రకటనలో పేర్కొంది. తమ సహనాన్ని బలహీనతగా భావించవద్దని, ప్రభుత్వ వైఖరి కారణంగానే తాము మళ్లీ రోడ్డెక్కాల్సి వస్తోందని హెచ్చరించింది. ఆగస్టు 18న సుప్రీంకోర్టులో జరిగిన విచారణ సందర్భంగా కూడా కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వలేదని సీజేపీ గుర్తుచేసింది. దేశవ్యాప్తంగా నమోదైన ఎఫ్ఐఆర్‌ల జాబితాను అందిస్తే, వాటిని రద్దు చేసే అంశాన్ని పరిశీలిస్తామని కోర్టు పేర్కొన్నప్పటికీ, ప్రభుత్వం నుంచి సరైన స్పందన రాలేదని తెలిపింది. ఇప్పటికీ ప్రభుత్వం నుంచి తమకు ఎలాంటి లిఖితపూర్వక హామీ అందలేదని వివరించింది. ఈ నిరసన కార్యక్రమంలో విద్యార్థులు, యువత, సామాన్య ప్రజలు శాంతియుతంగా, పెద్ద సంఖ్యలో పాల్గొనాలని సీజేపీ విజ్ఞప్తి చేసింది. “ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి” అనేదే తమ ప్రధాన డిమాండ్ అని ఈ సందర్భంగా స్పష్టం చేసింది.

# ఉద్యోగాలు భర్తీ చేయకుండా రిజర్వేషన్లకు ఎసరు

- మొదటి పేజి తరువాయి

రాజ్యాంగ సవరణ చేయాల్సిన అవసరం లేకుండానే రిజర్వేషన్లను అంతం చేసేందుకు ప్రభుత్వం ఈ మార్గాన్ని ఎంచుకుందని ఆయన మండిపడ్డారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ‘ఎక్స్’ వేదికగా ఖర్గే కొన్ని కీలక గణాంకాలను వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం, 2015లో కేంద్ర ప్రభుత్వంలో 4.21 లక్షల పోస్టులు ఖాళీగా ఉండగా, 2024 నాటికి ఆ సంఖ్య 8.24 లక్షలకు చేరింది. ప్రస్తుతం రైల్వే శాఖలో 2.40 లక్షలు, రక్షణ శాఖలో 2.41 లక్షలు, హోం మంత్రిత్వ శాఖలో 1.10 లక్షల పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, శాశ్వత ఉద్యోగాలను కాంట్రాక్టు ఉద్యోగాలుగా మార్చడం ద్వారా రిజర్వేషన్ ఫలాలను దెబ్బతీస్తున్నారని ఖర్గే ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలలో 5.1 లక్షల శాశ్వత ఉద్యోగాలను తొలగించారని, అదే సమయంలో కాంట్రాక్టు కార్మికుల వాటా 19 శాతం నుంచి 49 శాతానికి పెరిగిందని వివరించారు. “రాజ్యాంగాన్ని సవరించాల్సిన అవసరం లేదు... రిజర్వేషన్లు ఉన్న ఉద్యోగాలను తొలగిస్తే చాలు” అంటూ ఆయన తన పోస్టులో ప్రభుత్వాన్ని ఎండగట్టారు.

# మతం మారాలని సౌజన్యపై సాధిక్ ఒత్తిడి తెచ్చాడు

- మొదటి పేజి తరువాయి

వేధింపులతోనే ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు పేర్కొనడంతో అతడిపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టామని తెలిపారు. కాకినాడలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. “ఏఈ నూకరాజు, ఆయన భార్య మీనా, కుమార్తె సౌజన్య, మనవడు రియాన్స్ రెడ్డి గోదావరిలో దూకారు. రియాన్స్ ప్రాణాలతో బయటపడగా మిగిలిన ముగ్గురు మృతిచెందారు. రాజమహేంద్రవరంలో తొలుత కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టాం. నూకరాజు వద్ద, సౌజన్య స్కూటీలో రెండు సూసైడ్ నోట్‌లు దొరికాయి. మతం మారాలని సౌజన్యపై సాధిక్ ఒత్తిడి తెచ్చాడు. ఆమె మామ భాస్కర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు సర్పవరం పీఎస్‌లో కేసు నమోదు చేశాం. నిందితుడు సాధిక్‌ఖాన్ కోసం కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల నుంచి 10 పోలీసు బృందాలతో ఐదు రాష్ట్రాల్లో గాలింపు చేపట్టాం. చివరికి యూపీలోని మేరఠ్‌లో అతడి ఆచూకీ గుర్తించి అరెస్ట్ చేశాం. స్థానిక కోర్టులో హాజరుపరిచి ట్రాన్సిట్ వారంట్‌పై కాకినాడ తీసుకొచ్చాం.

నూకరాజు కుటుంబం ఆత్మహత్య తర్వాత పరారై మేరఠ్ చేరుకున్న సాధిక్.. స్నేహితులకు మాయమాటలు చెప్పి ఆశ్రయం పొందాడు. ఫోన్, డబ్బు పోయినట్లు వారికి చెప్పాడు. అతడిపై వస్తోన్న మరికొన్ని ఆరోపణలపై విచారణ జరుగుతోంది. నిర్ధారణ అయ్యాక ఆ వివరాలు వెల్లడిస్తాం. హత్య, బలవంతపు మతమార్పిడి సెక్షన్ల కింద సాధిక్‌పై కేసులు నమోదు చేశాం. నిందితుడిని న్యాయమూర్తి ఎదుట హాజరుపరుస్తాం. కస్టడీకి ఇవ్వాలని కోర్టును కోరతాం. కస్టడీలో ప్రశ్నిస్తే మరిన్ని విషయాలు తెలుస్తాయి. సామూహిక ఆత్మహత్య ఘటనకు ముందు బాధితులు ఎలాంటి ఫిర్యాదు చేయలేదు. ఇబ్బందికర పరిస్థితులు వచ్చినప్పుడు ధైర్యంగా పోలీసులకు ఫిర్యాదు చేయాలి. పోలీసులు అండగా ఉంటారు. క్షణికావేశంలో ఎలాంటి నిర్ణయాలు తీసుకోవద్దు” అని ఎస్పీ కోరారు.

**సాధిక్‌ఖాన్‌కు 14 రోజుల రిమాండ్**

సాధిక్‌ఖాన్‌ను పోలీసులు కోర్టులో హాజరుపరిచారు. న్యాయస్థానం అతడికి 14 రోజుల రిమాండ్ విధించింది. అనంతరం కాకినాడ సబ్‌జైలుకు సాధిక్‌ఖాన్‌ను తరలించారు. నిందితుడిని వారం రోజుల కస్టడీకి ఇవ్వాలంటూ సర్పవరం పోలీసులు కోర్టులో మంగళవారం పిటిషన్ దాఖలు చేయనున్నారు.




# నెగ్గాలంటే తగ్గాల్సిందే!

ఆంధ్రప్రదేశ్ లో జనసేన కొన్ని నియోజకవర్గాలకే పరిమితమయింది. అలాగే కొన్ని ప్రాంతాలలోనే దాని బలం ఉంది. అధికారంలోకి వచ్చిన తర్వాత జనసేన బలం కొంత తగ్గింది కానీ.. పెంచుకునే ప్రయత్నం ఇప్పటి వరకూ ఆ పార్టీ నాయకత్వం చేయకపోవడం కూడా ఇందుకు కారణం కావచ్చు. అందుకే స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసైనికులను నిరుత్సాహ పర్చబోమని, 2024 నాటి ఎన్నికల పొత్తులకు, ఇప్పటికీ చాలా తేడా ఉందని పవన్ కల్యాణ్ చెప్పినా పెద్దగా పసలేనిదిగానే చూడాలి. ఎందుకంటే ఆయన వ్యాఖ్యల్లోనే ఒక లింకు కనపడుతుంది. అదేంటంటే బలం ఉన్న చోట పోటీ చేయడానికి వెనకాడబోం అని చేసిన ప్రకటనలో చాలా అంతరార్థం ఉంది. ఎందుకంటే జనసేనకు రాష్ట్రమంతా బలం లేదని అందరికీ తెలుసు. ఆ పార్టీ నాయకత్వానికి కూడా తెలుసు.

**కమిటీలు ఏర్పాటు చేసినా...**

ఇప్పటికిప్పుడు కమిటీలను ఏర్పాటు చేసినా ఆ నియామకాల్లో నుంచి కూడా అసంతృప్తి తలెత్తే అవకాశాలున్నాయి. అలాగే కూటమి ప్రభుత్వంపై ఉన్న అసంతృప్తి తమ పార్టీపై కూడా బాగానే ఉందని మాత్రం ఆ పార్టీ నేతలకు అర్థమవుతుంది. పట్టుబట్టి కోరి అధికంగా సీట్లు తీసుకుని ఓడిపోయి చేతులెత్తేసేకన్నా.. తక్కువ స్థానాల్లో పోటీ చేయడం ఉత్తమన్న అభిప్రాయం కూడా ఎక్కువ మంది జనసేన నేతల్లో ఉంది. కానీ జనసేన క్యాడర్ లో మాత్రం ఎక్కువ స్థానాలు కావాలని పట్టుబడుతున్నారు. వారి వాదనను కాదనలేక, ఇప్పుడే అదేంలేదని చెప్పలేక అలా ఊరిస్తున్నారు తప్పించి పవన్ కల్యాణ్ కూడా స్థాయికి మించి స్థానాలను కోరే సాహసం చేయకపోవచ్చున్నది వాస్తవం. ఎందుకంటే పవన్ కల్యాణ్ ఇమేజ్ పైన కూడా స్థానిక సంస్థల ఫలితాలు ఆధారపడుతుంటాయి. అందుకే పవన్ వ్యాఖ్యలలో అనేక అర్థాలను అందరూ వెతుక్కుంటున్నారు.

**జనసేనను నిలబెట్టింది...**

2024 నాటికి, ఇప్పటికీ జనసేన తన బలం ఎంతో అంచనా వేయగలిగే పరిస్థితుల్లో లేదు. జనసేనను నిలిపింది మాత్రం పవన్ కళ్యాణ్ పట్టుదల మాత్రమే. ఆయన చరిష్మా. సామాజికవర్గం అండ కూడా గత ఎన్నికల్లో పనిచేసింది. ప్రస్తుతం జనసేన మొండిగా పోయే పరిస్థితి కూడా కనిపించడం లేదు. జనసేనకు తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల్లో కొన్ని నియోజకవర్గాల్లోనే బలంగా ఉంది. మిగిలిన నియోజకవర్గాల్లో మాత్రం నేటికీ బలహీనంగా ఉంది. అలాంటి పరిస్థితుల్లో చంద్రబాబు వద్ద పట్టుబట్టి ఎక్కువ స్థానాలను స్థానిక సంస్థల ఎన్నికల్లో తీసుకోక పోవచ్చు. కాకుంటే కొన్ని ఎక్కువ స్థానాలు ఇవ్వాలన్న ప్రతిపాదన పెట్టి అందులోనూ మినహాయింపులు అడిగే అవకాశాలున్నాయి. పవన్కు ఎక్కడ తగ్గాలో.. ఎక్కడ నెగ్గాలో తెలిసిన నేత కావడంతో పవన్ కల్యాణ్ మొండిపట్టు పట్టి కూర్చునే రకం కాదని ఆయనను దగ్గర నుంచి చూసిన వారికి ఎవరికైనా అర్థమవుతుంది. అదే చంద్రబాబు అది పెద్ద ధీమా.

# విజయ్ నిర్ణయం.. ఇతర రాష్ట్రాలకు జాక్‌పాట్

- మొదటి పేజి తరువాయి

పోటీ రాష్ట్రాలకు జాక్‌పాట్ లాంటిదేనని వ్యాఖ్యానించారు. “పరందూర్ విమానాశ్రయం విషయంలో దూరదృష్టి, ప్రణాళిక, సంప్రదింపులు లేకుండా తీసుకున్న నిర్ణయం రాష్ట్ర అభివృద్ధిని కొన్నేళ్లు వెనక్కి నెట్టేస్తుంది. యువత ఉపాధి కలలను దెబ్బతీస్తుంది. అసెంబ్లీలో చర్చకు అవకాశం ఇవ్వకుండా ఇలాంటి నిర్ణయం తీసుకోవడం ఆందోళనకరం. ఎలక్ట్రానిక్స్ ఎగుమతుల నుంచి ఆటోమొబైల్స్ వరకు అన్ని రంగాల్లో ముందున్న తమిళనాడుకు ఈ విమానాశ్రయం ఎంతో అవసరం. అన్ని ప్రత్యామ్నాయాలను విశ్లేషించిన అనంతరమే పరందూర్ ప్రాంతాన్ని ఎంపిక చేశాం. మరోసారి అధికారంలోకి వచ్చాక పనులను వేగవంతం చేయాలని ప్రణాళికలు రూపొందించాం. ఇప్పుడు కొత్త ప్రభుత్వం మళ్లీ మొదటినుంచి ఈ ప్రక్రియ ప్రారంభిస్తే.. రాష్ట్ర అభివృద్ధి కుంటుపడుతుంది’ అని స్టాలిన్ విమర్శించారు.

**గ్రాము బంగారు ఉంగరం తయారీ ఖర్చు ‘పైసా’**

పరందూర్ విమానాశ్రయ ప్రాజెక్టును విరమించుకుంటున్నట్లు అంతకుముందు సీఎం విజయ్ (ఎఆయిఖఎ) అసెంబ్లీలో ప్రకటించారు. అభివృద్ధికి తమ ప్రభుత్వం వ్యతిరేకం కాదని పేర్కొంటూ.. ఈ ఎయిర్‌పోర్టు కోసం ప్రత్యామ్నాయ స్థలాన్ని గుర్తిస్తామని తెలిపారు. “ఈ ప్రాజెక్టు కోసం ఎంపిక చేసిన ప్రాంతంలో దాదాపు 55 శాతం జలాశయాలు, చిత్తడి నేలలతో నిండి ఉంది. దీనివల్ల రన్‌వే కార్యకలాపాలపై ప్రభావం పడుతుంది. పైగా వరదల ప్రమాదం పొంచి ఉంది. ప్రజావ్యతిరేకత లేని చోట, నిపుణుల ఆధ్వర్యంలో సమగ్ర అధ్యయనాల అనంతరం కొత్త స్థలాన్ని ఖరారు చేస్తాం” అని చెప్పారు.

# ఏపీలో ఇన్-సర్వీస్ టీచర్లకు ప్రత్యేక టెట్..

- మొదటి పేజి తరువాయి

స్థానిక సంస్థల /APREIS/ప్రభుత్వ సంక్షేమ సంఘాల రెసిడెన్షియల్/ AP మోడల్ పాఠశాలలు / ప్రైవేట్ ఎయిడెడ్ / ఇతర (ప్రభుత్వ) పాఠశాల్లో పనిచేస్తున్న ఇన్–సర్వీస్ ఉపాధ్యాయుల కోసం ప్రత్యేకంగా టెట్ నిర్వహించనున్నారు. కంప్యూటర్ ఆధారితంగా జరిగే ఈ టెట్ పరీక్షలు రెండు సెషన్లలో జరగనున్నాయి. ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు మొదటి సెషన్; మధ్యాహ్నం 2.30గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు రెండో సెషన్ పరీక్ష నిర్వహిస్తారు. అక్టోబర్ 5 నుంచి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ కోసం అందుబాటులో ఉంచుతారు. అక్టోబర్ 24న ప్రాథమిక కీ విడుదల చేసి నవంబర్ 15న ఫలితాలను ప్రకటిస్తారు. అభ్యర్థులకు ఎలాంటి సందేహాలు ఉన్నా పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ కార్యాలలయంలో ఏర్పాటు చేసిన ఫోన్ నంబర్లు 8121947387, 7995649286, 6281704160కు కాల్ చేయొచ్చని టెట్ కన్వీనర్ ఎ.వెంకట కృష్ణారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.



# బస్టాండ్‌లో రేట్ల మోత.. ప్రయాణికులకు చుక్కలు..!

**ఎమ్మార్పీ కంటే రూ.5 నుంచి 10 అధిక వసూలు**

**ధరల పట్టిక లేకుండా యథేచ్ఛగా అమ్మకాలు**

**రాత్రి 10 దాటితే పట్టణంలో షాపులు బంద్..**

**బస్టాండ్ లో మాత్రం రాత్రంతా ఓపెన్**

**నిబంధనలకు విరుద్ధంగా సిగరెట్,**

**పాన్ మసాలా అమ్మకాలు.. పట్టించుకోని అధికారులు**

**మార్కాపురం పెన్ పవర్ ఆగస్టు 24**

స్థానిక ఆర్టీసీ బస్టాండ్ లో ప్రయాణికుల సౌకర్యం కోసం ఏర్పాటు చేసిన దుకాణాలే ఇప్పుడు వారికి భారంగా మారుతున్నాయి. బస్టాండ్ ఆవరణలో ఉన్న పలు దుకాణాల్లో నిత్యావసర వస్తువులపై ఎమ్మార్పీ కంటే రూ.5 నుండి రూ.10 వరకు అధికంగా వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎక్కడా ధరల పట్టిక లేకపోవడం, అడిగిన ధర చెల్లించక తప్పని పరిస్థితి ఉండటంతో సామాన్య ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ప్రయాణించే మహిళలు, వృద్ధులు, కుటుంబాలతో ప్రయాణించే వారు ఈ అధిక ధరలతో అవస్థలు పడుతున్నారు.

**ఎమ్మార్పీ రేట్లు మాయం.. ధరల పట్టిక గల్లంతు..**

ఆర్టీసీ నిబంధనల ప్రకారం బస్టాండ్ లోని ప్రతి దుకాణం ముందు తప్పనిసరిగా ధరల పట్టికను ప్రదర్శించాలి. అన్ని వస్తువులను ఎమ్మార్పీ ధరకే విక్రయించాలి. కానీ ఈ బస్టాండ్ లోని పలు షాపుల్లో ఈ నిబంధన తుంగలో తొక్కుతున్నారు. ఫోటోలో కనిపిస్తున్న ప్రధాన షాపుతో పాటు పక్కనే ఉన్న ఇతర షాపుల్లో కూడా ధరల పట్టిక ఎక్కడా కనిపించడం లేదు. రూ.20 ఉన్న వాటర్ బాటిల్ ను రూ.25కి, రూ.10 ఉన్న టీని రూ.15కి, రూ.10 ఉన్న బిస్కెట్ ప్యాకెట్ ను రూ.15కి, కూల్ డ్రింక్స్, చిప్స్, తినుబండారాలపై కూడా ఇష్టారాజ్యంగా 5 నుండి 10 రూపాయలు అధికంగా వసూలు చేస్తున్నారు. ప్రయాణికులు ప్రశ్నిస్తే కావాలంటే తీసుకోండి లేకపోతే లేదు అనే నిర్లక్ష్య సమాధానం వస్తోందని పలువురు ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బస్సు కోసం ఎదురుచూసే సమయంలో దాహం తీర్చుకోవడానికి, చిన్నపిల్లలకు తినుబండారాలు కొనడానికి వచ్చే ప్రయాణికులు గత్యంతరం లేక అధిక ధరలకే కొనుగోలు చేయాల్సి వస్తోంది.

**నిబంధనలకు విరుద్ధంగా సిగరెట్, పాన్ మసాలాల అమ్మకాలు..**

ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో సిగరెట్లు, బీడీలు, పాన్ మసాలా, గుట్కా వంటి వస్తువులను విక్రయించకూడదనే స్పష్టమైన నిబంధన ఉంది. కానీ ఇక్కడ ఉన్న కొన్ని దుకాణాల్లో ఈ నిబంధనలను పట్టించుకోకుండా



బహిరంగంగానే విక్రయాలు సాగిస్తున్నారు.రాత్రి వేళల్లో పట్టణవాసులు, కళాశాల విద్యార్థులు, యువకులు సిగరెట్లు, టీ కోసం ఇక్కడికి చేరుకుంటున్నారు. దీంతో బస్టాండ్ లో అనవసర రద్దీ పెరిగి, ప్రశాంతంగా బస్సు కోసం ఎదురుచూడాల్సిన ప్రయాణికులకు ఇబ్బందికరంగా మారుతోంది.

**రాత్రి 10 దాటితే పట్టణమంతా బంద్.. బస్టాండ్ లోనే దిక్కు..**

పట్టణంలో రాత్రి 10 గంటలు దాటితే దాదాపు అన్ని హోటళ్లు, దుకాణాలు మూతపడతాయి. దీంతో రాత్రి వేళ బస్సు దిగిన, బస్సు కోసం ఎదురుచూసే ప్రయాణికులకు బస్టాండ్ లోని దుకాణాలే ఏకైక ఆధారం. ఈ అవసరాన్ని అక్కడి వ్యాపారులు ఆసరాగా చేసుకుంటున్నారు. కొన్ని దుకాణాలు రాత్రి 12 నుండి తెల్లవారుజాము రెండు గంటల పైనే తెరిచి ఉంచుతున్నారు. రాత్రి సమయంలో తనిఖీలు ఉండవనే ధీమాతో మరింత ఎక్కువ ధరలకు అమ్మకాలు సాగిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. రాత్రి పూట బస్టాండ్ లో గుమిగూడే యువకుల వల్ల మహిళా ప్రయాణికులు, చిన్నపిల్లలతో ప్రయాణించే కుటుంబాలు భయాందోళనకు గురవుతున్నాయి. కూర్చోవడానికి సరైన స్థలం లేక, తాగడానికి నీళ్లు కూడా అధిక ధర పెట్టి కొనాల్సిన దుస్థితి నెలకొందని ప్రయాణికులు వాపోతున్నారు.

**తనిఖీలు కరువు.. అధికారులు ఏం చేస్తున్నారంటూ ప్రశ్న..**

ఇన్ని అక్రమాలు బహిరంగంగా జరుగుతున్నా సంబంధిత అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రయాణికులు, ప్రజా సంఘాలు ప్రశ్నిస్తున్నారు. బస్టాండ్ లోని దుకాణాలను డిపో అధికారులు క్రమం తప్పకుండా తనిఖీ చేయాలి. ఎమ్మార్పీ కంటే ఎక్కువ వసూలు చేస్తున్న వారిపై కేసులు నమోదు చేయాలి. ఫుడ్ సేఫ్టీ అధికారులు నాణ్యతను పరిశీలించాలి. కానీ నెలల తరబడి ఎలాంటి తనిఖీలు జరగడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మార్కాపురం బస్టాండ్ లోని అన్ని దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని, ప్రతి దుకాణం ముందు ధరల పట్టికను తప్పనిసరి చేయాలని, ఎమ్మార్పీ కంటే ఎక్కువ వసూలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా చూడాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.

పెన్ పవర్

MARKAPURAM మార్కాపురం

మార్కాపురం - ప్రకాశం

# అద్దంకి అభివృద్ధి పనులకు శ్రీకారం

**టిడ్కో గృహాల మౌలిక వసతులకు రూ.9.70 కోట్లు.**

**ఊరచెరువు పునరుద్ధరణకు రూ.5.10 కోట్లు.**

**శంకుస్థాపన చేసిన రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి. రవికుమార్.**





**అద్దంకి, ఆర్.సి(పెన్ పవర్) ఆగస్టు 24:**

అద్దంకి పురపాలక సంఘం పరిధిలో అభివృద్ధి పనులకు రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ లాంఛనంగా శంకుస్థాపన చేశారు. ఎన్టీఆర్ నగర్, శింగరకొండ వద్ద నిర్మిస్తున్న టిడ్కో గృహాలకు మౌలిక వసతుల కల్పన పనులను రూ.9.70 కోట్ల అంచనా వ్యయంతో ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తాగునీరు, మురుగునీటి పారుదల వ్యవస్థ, రహదారుల నిర్మాణం వంటి మౌలిక వసతులు కల్పించి గృహాలను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువస్తామని ప్రకటించారు. గత ప్రభుత్వ హయాంలో ఈ గృహాల నిర్మాణం తీవ్ర నిర్లక్ష్యానికి గురై నిలిచిపోయిందని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వీటిపై ప్రత్యేక దృష్టి సారించి పనులు పునఃప్రారంభించామని వెల్లడించారు. అర్హులైన పేదలకు త్వరితగతిన గృహాలు అందించడమే లక్ష్యంగా పనులు వేగవంతం చేస్తున్నట్లు ఆయన వివరించారు.

**సుందరంగా ఊరచెరువు..**

అద్దంకి పట్టణంలోని ఊరచెరువు పునరుద్ధరణ పనులకు మంత్రి రవికుమార్ భూమిపూజ చేశారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో అమృత్ 2.0 నిధులు రూ.5.10 కోట్లతో ఈ పనులు చేపట్టినట్లు సంతోషం వ్యక్తం చేశారు. ఊరచెరువును త్వరితగతిన పునరుద్ధరించి నడక మార్గాలు, పచ్చదనం, రంగురంగుల పూలమొక్కలు, ఆధునిక ఉద్యానవనాలతో సుందరీకరించి ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు. పట్టణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, అద్దంకిని మరింత ఆధునికంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు.

# గ్రాసం కరవు.. పోషణ బరువు

**వలేటివారిపాలెంలో పశువుల అవస్థలు**

**ఎల్ నినో ఎఫెక్ట్ అంటున్న అధికారులు**



**వలేటివారిపాలెం, పెన్ పవర్, ఆగస్టు 24:**

మండలంలో పశుగ్రాసం తీవ్ర కొరత ఏర్పడింది. పచ్చగడ్డి లేక, తాగడానికి చుక్క నీరు లేక మూగజీవాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. ఈ ఏడాది వర్షాకాలంలో వర్షాలు దోబూచులాడటానికి ఎల్ నినో ప్రభావమే కారణమని వ్యవసాయ, పశు సంవర్ధక శాఖ అధికారులు చెబుతున్నారు.సకాలంలో వర్షాలు కురవకపోవడంతో చెరువులు, కుంటలు, జలాశయాలు, బోర్లు పూర్తిగా అడుగంటిపోయాయి.

**కిలోమీటర్లు తిరుగుతున్న పశువులు:**లి బీడు భూములు, పొలాల్లోని పచ్చిమేత పూర్తిగా ఎండిపోయింది. రైతులు పశువులను వదిలేస్తుండటంతో అవి మేత కోసం కిలోమీటర్ల కొద్దీ తిరుగుతున్నాయి. ఎక్కడైనా పచ్చగడ్డి కనిపిస్తే ఎగబడుతున్నాయి. దొరకని పరిస్థితుల్లో చెట్ల ఆకులు, అలముతో పొట్ట నింపుకుంటున్నాయి. నీరు తాగుదామంటే చెరువుల్లో, కుంటల్లో నీరు లేక బావురుమంటున్నాయి.

**వరి గడ్డి కూడా కరువు:** గతంలో ప్రతి ఇంటి వద్ద వరి గడ్డి వాములు దర్శనమిచ్చేవి. వేసవిలో పశువులకు అవే ఆధారం. కానీ ఇప్పుడు వరి కోతలకు హార్వెస్టర్లు రావడంతో పొలాల్లోనే గడ్డి ముక్కలైపోతోంది. దీంతో పశువులకు దాణా దొరకని పరిస్థితి ఏర్పడింది.

**కబేళాల బాట:** పోషణ భారం పెరగడంతో రైతులు తమకు ఎంతో ఇష్టమైన పశువులను, గొర్రెలను, గేదెలను తప్పని పరిస్థితుల్లో కబేళాలకు తరలిస్తున్నారు. పశు సంపద రోజురోజుకూ అంతరించిపోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**రైతుల డిమాండ్:** ప్రభుత్వం వెంటనే స్పందించి మండలంలో పశుగ్రాస కేంద్రాలు ఏర్పాటు చేయాలని, దాణా, తాగునీటి వసతి కల్పించాలని రైతులు కోరుతున్నారు.

# మూడు దశాబ్దాల కల సాకారం అవుతున్న వేళ

**వెలుగొండ నీటి విడుదల**

**సందర్భంగా ఘనంగా భారీ బైక్ ర్యాలీ**

**స్వయంగా బైక్ నడిపి శ్రేణులను**

**ఉత్సాహపరచిన అశోకుడు**

**వెనుక వందలాది బైక్ లు ర్యాలీ**

**పవిత్ర పుణ్యక్షేత్రమైన**

**శ్రీ పాతాళనాగేశ్వర స్వామి, పార్వతి**

**దేవిలకు ప్రత్యేక పూజలు**

**ఆలయంలో ముత్తుముల కు**

**పూర్ణకుంభంతో స్వాగతం**







**గిద్దలూరు:పెన్ పవర్ ఆగస్టు 24**

వెలుగొండ ప్రాజెక్టు టాన్నేళ్ళ నుంచి నీటి విడుదల సందర్భంగా గిద్దలూరు పట్టణంలో ఎమ్మెల్యే అశోక్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిద్దలూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం నుంచి శ్రీ పాతాళ నాగేశ్వర స్వామి దేవస్థానం వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈర్యాలీలో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి బుల్లెట్ ను స్వయంగా నడిపి కూటమి శ్రేణుల్లో ఉత్సాహం ఉసిగొలిపారు. ర్యాలీ లో తెలుగుదేశం వర్ధిల్లాలి, చంద్రబాబు పవన్ కళ్యాణ్ , అశోక్ రెడ్డిల నాయకత్వం వర్ధిల్లాలి అనే నినాదాలతో గిద్దలూరు వీధులు మారుమ్రోగాయి. అశోక్ రెడ్డి ముందు బైక్ నడుపుతుండగా ఆయన వెంట వందలాది బైకుల పై కార్యకర్తలు అనుసరించారు. పలు వీధులగుండా ర్యాలీ సాగింది. అశోక్ రెడ్డి వెలుగొండ కు అనుకూలంగా ఈవినూత్న కార్యక్రమం నిర్వహించి , పండుగ వాతావరణం సృష్టించారు. ముడుదశాబ్దాల కల సాకారం అవుతున్న వేళ రైతులు , కూటమి పార్టీ శ్రేణులు ఉత్సహంగా ర్యాలో పాల్గొని హర్షద్వానాలు చేశారు. వెలుగొండ ప్రాజెక్టు టన్నేళ్ళ నుంచి నీరు విడుదల కావడం గిద్దలూరు నియోజకవర్గ రైతులు, ప్రజలకు ఎంతో సంతోషకరమైన విషయమని నాయకులు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కుటుంబ సభ్యుల పేరటపాతాళ నాగేశ్వర స్వామి, పార్వతీదేవి అమ్మవారికి ప్రత్యేక స్వామికి అభిషేకం , అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు, రైతుల పంట పొలాలకు సమృద్ధిగా నీరు అందాలని, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని స్వామి , అమ్మవార్లను ప్రార్థించారు. వెలుగొండ ప్రాజెక్టు నీటితో గిద్దలూరు నియోజకవర్గంలో వ్యవసాయం అభివృద్ధి చెంది, రైతుల జీవితాల్లో మరింత సంతోషం, సుభిక్షం నెలకొనాలని ఎమ్మెల్యే అశోక్ రెడ్డి ఆకాంక్షించారు. బైక్ ర్యాలీ పాతాళ నాగేశ్వరస్వామి ఆలయం చెంతకు చేరగానే ఆలయ ప్రధాన అర్చకులు దుర్భక సునీల్ శాస్త్రి ఆధ్వర్యంలో అశోక్ రెడ్డికి ఆలయ మర్యాదలతో పూర్ణకుంభం తో స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజల అంతరం శేషవస్త్రం బహుకరించి వేదాశీస్సులు అందజేశారు. ఈ బైక్ ర్యాలీలో కూటమి నాయకులు కార్యకర్తలు రైతులు పట్టణ ప్రజలు పాల్గొన్నారు. నినాదాలతో , పసుపు రంగు జెండాలతో ర్యాలీ ఆనందోత్సవాల మధ్య సాగింది.

# అంగన్వాడీ చుట్టూ అడవి..చిన్నారుల ప్రాణాలతో చెలగాటమా..?

**తర్లుపాడు ముస్లిం బజార్ లో దయనీయ**

**స్థితిలో అంగన్వాడీ కేంద్రం**

**చిల్లచెట్లు, పిచ్చిమొక్కల మధ్య పిల్లల అడుగులు**

**పాము కనిపించడంతో తల్లిదండ్రుల్లో భయాందోళన**

**తర్లుపాడు పెన్ పవర్ ఆగస్టు 24**

ప్రభుత్వం పేద పిల్లల భవిష్యత్తు కోసం కోట్లు ఖర్చు చేసి అంగన్వాడీ కేంద్రాలను నడుపుతోంది.. కానీ తర్లుపాడులోని ఆ కేంద్రాన్ని చూస్తే ఆ లక్ష్యం నీరుగారుతున్నట్లే ఉంది. తర్లుపాడు పట్టణంలోని ముస్లిం బజార్ లో ఉన్న అంగన్వాడీ కేంద్రం పరిస్థితి దారుణంగా తయారైంది. కేంద్రం చుట్టూ పిచ్చిమొక్కలు, తుమ్మచెట్లు ఏపుగా పెరిగి చిన్నపాటి అడవిని



తలపిస్తోంది. అంగన్వాడీకి వెళ్లే సిమెంట్ రోడ్డు సైతం మొక్కలతో పూర్తిగా కప్పబడిపోయింది.



**పిల్లల్ని పంపాలంటేనే భయం..:** ఈ కేంద్రానికి తమ పిల్లలను పంపించాలంటే తల్లిదండ్రులు భయభ్రాంతులకు గురవుతున్నారు. చిన్నారులు ఆ ముళ్లపొదల మధ్య నుంచే నడుచుకుంటూ కేంద్రానికి వెళ్లాల్సి వస్తోంది. పాములు, తేళ్లు, ఇతర విషపురుగులు ఉండొచ్చనే భయంతో తల్లిదండ్రులు వణికిపోతున్నారు. ఇటీవల ఓ చిన్నారి తల్లి కేంద్రం సమీపంలో సర్పాన్ని చూడటంతో ఒక్కసారిగా ఆందోళన నెలకొంది. దీంతో చాలామంది తల్లులు తమ పిల్లలను కేంద్రానికి పంపడం మానేశారని స్థానికులు చెబుతున్నారు.

**అధికారులు స్పందించండి..:** అక్షరాలు నేర్చుకోవాల్సిన చిన్నారులు, ముళ్లకంపల మధ్య అడుగులు వేయాల్సి వస్తోంది. ఇది కేవలం పిచ్చిమొక్కల సమస్య కాదు.. చిన్నారుల భద్రతకు సంబంధించిన అంశం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పంచాయతీ యంత్రాంగం స్పందించి వెంటనే పిచ్చిమొక్కలను తొలగించి, అంగన్వాడీ పరిసరాలను శుభ్రం చేయాలని తల్లిదండ్రులు, స్థానికులు వేడుకుంటున్నారు.

# అర్జీల నమోదులో ప్రత్యేక శ్రద్ధ అవసరం


## - సి సి ఎల్ ఏ జి జయలక్ష్మి సూచన

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు ఆగస్టు 24**

రెవెన్యూ గ్రీవెన్స్ అర్జీల నమోదు సమయంలో ప్రత్యేక శ్రద్ధ అవసరమని సీసీఎల్ఏ జి.జయలక్ష్మి చెప్పారు. ముఖ్యంగా రెవిన్యూయేతర సమస్యలను రెవెన్యూ విభాగంలో నమోదు చేయకుండా జాగ్రత్త వహించాలన్నారు. సర్వే సెటిల్మెంట్స్, ల్యాండ్ రికార్డ్స్ కమిషనర్ రోణంకి కూర్మనాథ్ తో కలిసి సోమవారం జిల్లాకు వచ్చిన ఆమె కలెక్టరేట్లో జరుగుతున్న ' మీకోసం ' కార్యక్రమంలో పాల్గొన్నారు. కలెక్టర్ పి.రాజాబాబుతో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అర్జీదారులకు కల్పిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. వచ్చిన ప్రజలకు అర్జీలు రాసి పెట్టడంలో చేస్తున్న సహాయం, వాటిని ఆన్లైన్ చేస్తున్న తీరును జయలక్ష్మి స్వయంగా పరిశీలించారు. కాగా, ఈ మొత్తం ప్రక్రియను, అర్జీలను పరిష్కరిస్తున్న విధానాన్ని కలెక్టర్ వివరించారు. ఒకే అంశంపై రెండు, మూడుసార్లు వచ్చిన అర్జీలను గుర్తించేలా ప్రత్యేక ఏర్పాటు చేశామని, వాటి పరిష్కారానికి కూడా అర్జీదారులను కలెక్టరేటుకు పిలిపించి మాట్లాడుతున్నామని చెప్పారు. ఆన్ లైన్ లో రెవెన్యూయేతర అర్జీలను కూడా రెవెన్యూ కేటగిరీలో ప్రజలు సమర్పిస్తున్నారని, ఫలితంగా రెవెన్యూ అర్జీల సంఖ్య, అసంతృప్తిస్థాయి పెరుగుతోందని వివరించారు. దీనిపై సీసీఎల్ఏ స్పందిస్తూ రాష్ట్రస్థాయిలో ఈ పరిణామంపై దృష్టి సారిస్తామన్నారు. వ్యక్తిగతంగా సమర్పించే అర్జీలను ఆన్లైన్ చేసే సమయంలో ఇలాంటి సమస్య తలెత్తకుండా పరిశీలించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. అందుకోసం ఒక



అధికారిని నియమించాలని చెప్పారు. ' మీసేవ ', ' స్వర్ణ గ్రామ - స్వర్ణ వార్డు ' స్థాయిలో అందాల్సిన సేవల కోసం కూడా ప్రజలు ' మీకోసం ' కార్యక్రమానికి వస్తున్నట్లు అధికారులు ఈ సందర్భంగా జయలక్ష్మి దృష్టికి తీసుకువెళ్లారు. ఇలాంటి అర్జీలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, అవసరమైతే గ్రీవెన్స్ రోజున కలెక్టరేట్లో ' మీసేవ ' కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టరుకు ఆమె సూచించారు. సమస్యల పరిష్కారం కోసం వచ్చే అర్జీదారులకు అవసరమైన సహాయం అందించి, సంబంధిత శాఖకు సదరు అర్జీ వెళ్లేలా చూడడం ద్వారా సత్వర పరిష్కారం లభించి అర్జీదారులలో సంతృప్తి పెరుగుతుందన్నారు. రెవెన్యూ శాఖపై కూడా ఒత్తిడి



తగ్గుతుందని, వాస్తవ సమస్యల పరిష్కారంలో నాణ్యత పెరుగుతుందన్నారు. రెవెన్యూ అర్జీల పరిష్కారంలో సాంకేతిక సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని అధికారులకు ఆమె చెప్పారు. పిజి ఆర్ఎస్ లో మొత్తం 236 అర్జీలు వచ్చాయి. ఈ కార్యక్రమంలో డీఆర్వో పి.వి.రమణ, సబ్ కలెక్టర్ డి.హిమవంశీ, ఒంగోలు, అద్దంకి ఆర్డిఓలు చంద్రశేఖర్ నాయుడు, విజయ జ్యోతి కుమారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మాధురి, జెడ్పి సీఈవో చిరంజీవి, స్వర్ణ గ్రామ - స్వర్ణ వార్డు సచివాలయాల జిల్లా నోడల్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ రాజా మాథ్యూ, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## పోలీసు పిజి ఆర్ఎస్ కు 74 ఫిర్యాదులు



**మునిసిపల్ కార్పొరేషన్ ఒంగోలు,పెన్ పవర్ ఆగస్టు 24**

జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం జిల్లా ఎస్పీ పోలీస్ అధికారులు ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం (మీకోసం)ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుండి వివిధ సమస్యలతో వచ్చిన ఫిర్యాదుదారుల అర్జీలను జిల్లా ఎస్పీ వి హర్ష వర్ధన్ రాజు స్వీకరించారు. ఫిర్యాదు దారులతో ఎస్పీ ముఖాముఖీ మాట్లాడి వారి సమస్యల పూర్వాపరాలను అడిగి తెలుసుకుని, వాటిని చట్టపరిధిలో త్వరితగతిన పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. ఫిర్యాదు చేయడానికి వచ్చే వృద్ధులు, నడవలేని పరిస్థితిలో ఉన్నవారి సమస్యలను ప్రత్యేకంగా పరిశీలనలోకి తీసుకొని, సంఘటన స్థలాలను సందర్శించి చట్టప్రకారం సత్వర న్యాయం అందించాలని పోలీస్ అధికారులకు జిల్లా ఎస్పీ సూచించారు. అలాగే జిల్లా పోలీస్ కార్యాలయానికి రాలేని ప్రజలు తమ ఫిర్యాదులను సమీపంలోని పోలీస్ స్టేషన్లు, సర్కిల్ కార్యాలయాలు, సబ్-డివిజన్ కార్యాలయాల్లో కూడా అందజేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ హాజరత్తయ్య, అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జున రావు, గుడ్లూరు సీఐ రమేష్, ప్యానెల్ అడ్వొకేట్ బి.బాలాజీ సింగ్, సమస్యల పరిష్కార వేదిక ఎస్సై యాస్మిన్, సిబ్బంది పాల్గొన్నారు.

## 31న వెలుగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవం.. ప్రజల చిరకాల వాంఛ నెరవేరబోతోంది - ఎమ్మెల్యే కందుల



**మార్కాపురం పెన్ పవర్ ఆగస్టు 24**

ఎన్నో ఏళ్లుగా ఈ ప్రాంత ప్రజల చిరకాల వాంఛ అయిన వెలుగొండ ప్రాజెక్టు నీటి విడుదల ఈ నెల 31న నెరవేరబోతోందని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి గ అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దయతో, చొరవతో వెలుగొండ ప్రాజెక్టు పూర్తయి ప్రారంభోత్సవానికి సిద్ధమైందని తెలిపారు. సోమవారం మార్కాపురం పట్టణంలోని జవహర్ నగర్ లో గల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పట్టణ తెలుగుదేశం పార్టీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ వెలుగొండ ప్రాజెక్టు పూర్తి కావడంతో ఈ ప్రాంత రైతులు, ప్రజలు మునుపెన్నడూ లేనంత సంతోషంగా ఉన్నారన్నారు. 31వ తేదీన జరగబోయే ప్రాజెక్టు ప్రారంభోత్సవ మహోత్సవాన్ని నియోజకవర్గ ప్రజలందరూ ఒక పండుగలా భావించి, భారీ బహిరంగ సభకు విచ్చేసి ఆ మధుర ఘట్టాన్ని తిలకించాలని పిలుపునిచ్చారు. వెలుగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి సంఘీభావంగా మంగళవారం పట్టణంలో భారీ ట్రాక్టర్ల ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. మార్కెట్ యార్డు నుంచి శ్రీ అల్లూరు పోలేరమ్మ దేవస్థానం వరకు ఈ ర్యాలీ కొనసాగుతుందని, నియోజకవర్గంలోని తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు, రైతు సోదరులు తమ ట్రాక్టర్లతో స్వచ్ఛందంగా ఉదయం 10 గంటలకు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ వెంకటరెడ్డి తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వెలుగొండ నిర్వాసితులకు న్యాయం చేయండి

**కలెక్టర్ ను కలిసిన ఎమ్మెల్యే తాటిపర్తి, మాజీ ఎమ్మెల్యే అన్నా**





**మార్కాపురం పెన్ పవర్ ఆగస్టు 24**

వెలుగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు పూర్తిస్థాయిలో పరిహారం, పునరావాసం కల్పించకుండా ముంపు ప్రాంతాల్లో నీరు విడుదల చేయడం అన్యాయమని ఎర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, మాజీ శాసనసభ్యులు, మార్కాపురం వైఎస్ఆర్సీపీ నియోజకవర్గ ఇంచార్జ్ అన్నా రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ను కలిసి వెలుగొండ ప్రాజెక్టు నిర్వాసితులు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాజెక్టు కోసం భూములు, ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులకు ఇప్పటివరకు పూర్తి పరిహారం అందలేదని, పునరావాస కాలనీల్లో కనీస సౌకర్యాలు కూడా కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పరిహారం ఇవ్వకుండా హడావుడిగా నీటిని విడుదల చేస్తే ముంపు గ్రామాల ప్రజలు రోడ్డున పడతారని ఆందోళన వ్యక్తం చేశారు. ముందుగా నిర్వాసితులందరికీ న్యాయం చేసి, వారికి రావాల్సిన పరిహారం, పునరావాసం పూర్తిగా కల్పించిన తర్వాతే నీటిని విడుదల చేయాలని అధికారులను కోరామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాసిత గ్రామాల ప్రజలు, వైఎస్ఆర్సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎయిడ్స్ నిర్మూలన ప్రచార రథం ఎల్ ఇ డి వాహనాన్ని ప్రారంభించిన డాక్టర్ బాలాజీ



**మునిసిపల్ కార్పొరేషన్ ఒంగోలు, పెన్ పవర్ ఆగస్టు 24**

హెచ్ఐవి ఎయిడ్స్ పై అవగాహన మనందరి బాధ్యత, తెలుసుకోవటం మొదటి అడుగు - రక్షణ మీ చేతుల్లో ఉంది, పరీక్ష చేపించుకోవడం భయం కాదు ఆరోగ్యం కాపాడుకోవడంలో మంచి నిర్ణయం గా భావించాలని ప్రకాశం జిల్లా క్షయ, టీబి, ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ జి. బాలాజీ పేర్కొన్నారు. సోమవారం ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, ప్రకాశం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ హెచ్ఐవి ఎయిడ్స్ నియంత్రణ సమీకృత వ్యూహం దిష ఆధ్వర్యంలో హెచ్ఐవి ఎయిడ్స్ నియంత్రణ నిర్మూలన పై ఏర్పాటు చేసిన సమగ్ర ఆరోగ్య ప్రచార రథం ఎల్ఈడి వాహనాన్ని ఒంగోలు పాత రిమ్స్ హాస్పటల్ నుండి ఆయన ప్రారంభించారు. డాక్టర్ బాలాజీ మాట్లాడుతూ ఎల్ ఈ డి ముఖ్య ఉద్దేశం హెచ్ఐవి ఎయిడ్స్ పై క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కలిగించి నిర్మూలించలనే లక్ష్యంతో మరియు ప్రతి ఒక్కరూ ఉచిత వ్యక్తిగత హెచ్ఐవి పరీక్ష కోసం సమీపంలోని ఆరోగ్య కేంద్రానికి వెళ్లాలని పరీక్ష పూర్తిగా ఉచితమని, గోప్యంగా ఉంచబడుతుందని తెలిపారు. ఒకవేళ పరీక్షల్లో పాజిటివ్ అని నిర్ధారణని అయినట్లయితే వెంటనే ఏఆర్టిలో చికిత్స ప్రారంభించబడుతుందని జీవితకాలం ఆపకుండా కొనసాగిస్తే హెచ్ఐవి బాధితులు క్రమం తప్పకుండా మందులు వాడు కున్నట్లయితే మధుమేహం రక్త పోటు వంటి, ఇతర దీర్ఘకాలిక వ్యాధులు లాగానే హెచ్ఐవి తో కూడా సాధారణ జీవితం గడపవచ్చని తెలిపారు. హెచ్ఐవి ఎయిడ్స్ నియంత్రణ కొరకు తగు సూచనలు సలహాలు కొరకు జాతీయ టోల్ ఫ్రీ 1097 పై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకాశం, నెల్లూరు, మార్కాపురం జిల్లాల హెచ్ఐవి ఎయిడ్స్ నియంత్రణ సమీకృత వ్యూహం దిశా క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ ఎస్.కె అమీన్, సి ఎస్ ఓ ఎస్.సాయి, హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.వి సాగర్, గ్రో, సినార్డ్, స్వచ్ఛంద సంస్థల ప్రోగ్రాం మేనేజర్లు ఎస్కే పీర్ భాష,,వెంకటేశ్వర్లు, లింక్ వర్కర్ స్కీమ్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ జి స్వరూప్ కుమార్ కేర్ అండ్ సపోర్ట్ సెంటర్ ప్రోగ్రాం మేనేజర్ సుజాత పాల్గొన్నారు.

## పోలీసులకు వినతిపత్రం అందజేసిన బీజేపీ నాయకులు



**గుడ్లూరు, పెన్ పవర్, ఆగస్టు 24:**

లవ్ జిహాది వల్ల చనిపోయిన నూకరాజు కుటుంబానికి నష్టం కలిగించిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని మండల ప్రెసిడెంట్ జలగం వెంకట వరుణ్ కుమార్ ఆధ్వర్యంలో మండల బీజేపీ నాయకులు సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్ లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక బీజేపీ నాయకులు మాట్లాడుతూ సాధిక్ ఖాన్ లవ్ జిహదీ కారణంగా ఆత్మహత్య చేసుకున్న ఏఈ నూకరాజు కుటుంబంకు న్యాయం చేయాలన్నారు. ఈ కేసులో వంచన,మోసం, దోపిడీ,హత్య, లవ్ జిహదీ ఉగ్రవాదం ఉన్నాయని అన్నారు. షాధిక్ ఖాన్ ని కఠినంగా శిక్షించాలని . రాష్ట్ర డీజీపీ, హోం మంత్రి ఈ సంఘటనపై స్పందించాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రెసిడెంట్ జలగం వెంకట వరుణ్ కుమార్, మాజీ ప్రెసిడెంట్ ఇన్నమూరి ప్రమీల సుధాకర్, జొన్నాదుల సురేష్, జయకృష్ణ, దేవరకొండ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ నుంచే పిల్లల్లో లింగసమానత్వ భావన పెంపొందించాలి





**గుడ్లూరు, పెన్ పవర్, ఆగస్టు 24:**

అంగన్వాడీ స్థాయి నుంచే పిల్లలలో లింగ సమానత్వ భావనను పెంపొందించాలని ఐసీడీఎస్ సూపర్వైజర్ కె. కామేశ్వరి అన్నారు. మండలంలో రెండో విడత జ్ఞానజ్యోతి శిక్షణా కార్యక్రమానికి హాజరైన కార్యకర్తలకు సోమవారం శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ అంతా ఆరోగ్యమే మహాభాగ్యం, పిల్లల బంగారు భవిష్యత్తు కోసం అంగన్వాడీ కార్యకర్తలు మరియు తల్లిదండ్రులు ఉమ్మడి బాధ్యత గురించి తెలియజేయడమైనదని కామేశ్వరి అన్నారు. ఈ సందర్బంగా కామేశ్వరి మాట్లాడుతూ సున్నా నుండి ఆరు సంవత్సరాల్లో పిల్లలు ఎదుగుదల అత్యంత కీలక సమయం కాబట్టి, ఈ సమయంలో పిల్లలకి ఆరోగ్యము మరియు పోషణ మీద, సమతుల ఆహారం మీద, పరిశుభ్రత వ్యాధుల నుండి రక్షణ మీద, పోషకాహార లోపాల్ని ముందుగానే గుర్తించి, ఆ సమస్య నివారించడానికి అంగన్వాడీ కేంద్రాల్లో తల్లిదండ్రులకు సలహాలు ఇవ్వడం గురించి తెలియజేయడమైనదన్నారు. పిల్లల్లో ఎదుగుదల పర్యవేక్షణ లోపాలను గుర్తించి తల్లిదండ్రులను భాగస్వాములు చేయటంపై బలమైన పునాది వేయవచ్చునన్నారు. బాలల రక్షణ చట్టాలు గురించి తెలియచేయడమైనదన్నా రు. లింగం ఆధారంగా కాకుండా పిల్లలకు ఇష్టమైన అంశము ఆధారంగా వాళ్ళకి అభ్యాసన జరిగే విధంగా కృషి చేయాలనీ చెప్పడం జరిగిందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమానికి జడ్పీహెచ్ఎస్ స్కూల్ హెచ్ఎం పి. రామ్ మోహన్, కేఆర్పి పి.వాణి, డిఆర్పిలు టి.చంద్రశేఖర్, ఏ. విజయ్ కుమార్, కే. కామేశ్వరి మరియు అంగన్వాడీ టీచర్స్ తదితరులు హాజరయ్యారు.

## ఏ.ఈ నూకరాజు కుటుంబ ఆత్మహత్య కేసులో సమగ్ర విచారణ జరపాలి

**బీజేపీ డిమాండ్**



**మార్కాపురం పెన్ పవర్ ఆగస్టు 24**

ఏ.ఈ నూకరాజు కుటుంబ ఆత్మహత్య కేసులో అన్ని కోణాల్లో సమగ్ర విచారణ జరిపి నిందితులను కఠినంగా శిక్షించాలని, ఈ కేసులో డిజిపి, హోం మంత్రి స్పందించాలని జనతా వారధి పట్టణ అధ్యక్షులు వెంకట ప్రవీణ్ డిమాండ్ చేశారు.ఈ మేరకు సోమవారం పట్టణ పోలీస్ స్టేషన్లో వినతిపత్రం అందజేశారు. ఆ లేఖలో కుటుంబ ఆత్మహత్యకు దారితీసిన పరిస్థితులపై పూర్తిస్థాయి విచారణ జరపాలని కోరారు. ఈ కేసును కేవలం ఆర్థిక లావాదేవీల కోణంలో కాకుండా, బెదిరింపులు, దోపిడీ, ఇతర కోణాల్లో కూడా విచారించాలని విజ్ఞప్తి చేశారు.అలాగే రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి ఘటనలపై వచ్చిన ఫిర్యాదులు, నమోదైన కేసులు, వాటి పరిస్థితిపై డిజిపి, హోం మంత్రి బహిరంగంగా ప్రకటన చేయాలని బీజేపీ తరపున డిమాండ్ చేశారు. పోలీసు వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కలిగేలా బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.

## పేదల హక్కులకు భరోసా కల్పించాలి -ఎస్ కె వై పెద్ద మస్తాన్

**సి.ఎస్.పురం,పెన్ పవర్ ఆగస్టు 24**

పేదలకు సామాజిక న్యాయం, ఆత్మగౌరవం కల్పించి హక్కులకు భరోసా కల్పించుటకు ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని సీపీఐ మండల కార్యదర్శి ఎస్.కె.వై. పెద్ద మస్తాన్ డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సమితి పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా తహసీల్దార్ కార్యాలయాల ఎదుట నిర్వహిస్తున్న ధర్నాలు, వినతిపత్రాల సమర్పణలో భాగంగా సోమవారం సి. ఎస్.పురం తహసీల్దార్ కార్యాలయంలో ఇన్చార్జి సీనియర్ అసిస్టెంట్ పద్మనాభం నకు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా పెద్ద మస్తాన్ మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి, విద్య, వైద్యం, ఆరోగ్యం, ఆహార భద్రత, గ్రామీణ మౌలిక వసతుల కల్పనలో విఫలమైందని విమర్శించారు. ఎన్నో దశాబ్దాల పోరాటాల ఫలితంగా పేదలు సాధించుకున్న చట్టాలను నిర్వీర్యం చేస్తూ కొత్త చట్టాల పేరుతో వారికి అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు.మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి బదులుగా విబిజిరామ్ జి చట్టాన్ని తీసుకురావడం వల్ల గ్రామీణ ఉపాధి కూలీలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. ముఖ ఆధారిత హాజరు, ఐరిస్ విధానాలతో కూలీలు అవస్థలు పడుతున్నారని, చేసిన పనులకు సకాలంలో కూలి డబ్బులు చెల్లించడం లేదన్నారు అటవీ హక్కుల చట్టం, దళితులు,



గిరిజనులు సాధించుకున్న హక్కుల చట్టాలను సమర్థవంతంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన పేదలకు పిఎంఏవై పథకం కింద తగినన్ని ఇల్లు మంజూరు చేయాలని, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు గ్రామీణ ప్రాంతాల్లో అర్హులైన పేదలకు మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్ల ఇంటి స్థలం తో పాటు ప్రతి లబ్ధిదారుడికి ఐదు లక్షల రూపాయలు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సిపిఐ మండల జాయింట్ కార్యదర్శి గువ్వల నరసింహులు, సవరం రమేష్ , రాగి ఏసు, నల్లగట్ల నారాయణ, రాగి నారాయణ, ఆర్ అంకమ్మ, యన్ రవణమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఆల్ ఫ్రెడ్ కి ఘన నివాళి అర్పించిన మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు

**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 24**

గిద్దలూరు పట్టణంలోని పీ.ఆర్.కాలనీలో నిర్వహించిన దివంగత ఆర్టీసీ కండక్టర్ ఆల్ ఫ్రెడ్ ఆదరణ కూడిక కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు సోమవారం పాల్గొని అల్ఫ్రెడ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అంతరం కుటుంభ సభ్యులను పరామర్శించి ఓదార్చారు .ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకులు భూమా బాల నరసింహారెడ్డి, సి విఆర్ మురళి , జయరాం రెడ్డి, తదితర వైకాపా నాయకులు పాల్గొన్నారు.



# పాములపల్లి అరటి తోటలో చిరుత సంచారం

## భయకంపితులైన ప్రజలు -ఫారెస్ట్ అధికారుల ప్రత్యేక నిఘా





**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 254**

గిద్దలూరు మున్సిపాలిటీ పరిధిలోని పాములపల్లె సమీపం అరటి తోటలో చిరుతపులి సంచారం కలకలం రేపింది. అరటి తోటలో చిరుతను చూసినట్లు రైతు సమాచారం ఇవ్వడంతో అటవీశాఖ అధికారులు అప్రమత్తమై గత నాలుగు రోజులుగా ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నారు. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు వెంటనే అక్కడికి చేరుకుని పరిస్థితిని పరిశీలించి చిరుత కదలికలను గుర్తించేందుకు పాదముద్రలను పరిశీలించడంతో పాటు ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేసి డ్రోన్ కెమెరాతో నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. గిద్దలూరు ప్రాజెక్ట్ టైగర్ సబ్ డీఎఫ్ఓ బాలరాజు సోమవారం అరటి తోట ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతు నుంచి సమాచారం అందిన వెంటనే అటవీశాఖ సిబ్బంది స్పందించి గత నాలుగు రోజులుగా అనుమానస్పద ప్రాంతంలో పర్యవేక్షణ చేపట్టామని డ్రోన్, ట్రాప్ కెమెరాల ద్వారా పరిశీలించినప్పటికీ ఇప్పటివరకు చిరుత పులి సంచరించిన కదలికలకు సంబంధించిన ఎలాంటి ఆధారాలు కెమెరాల్లో నమోదు కాలేదన్నారు. సోమవారం అరటి తోట ప్రాంతాన్ని మరియు రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతాన్ని పరిశీలించామని అరటి తోటలతో పాటు దగ్గరలో ఉన్న రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతాన్ని కూడా జల్లెడ పడుతున్నామని తెలిపారు. ప్రస్తుతానికి రైతులు, స్థానిక ప్రజలు ఎలాంటి భయాందోళనకు గురికావాల్సిన అవసరం లేదని, అయితే చిరుత కదలికలకు సంబంధించి ఏదైనా సమాచారం లేదా అనుమానాస్పద ఆనవాళ్లు కనిపిస్తే వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాలని కోరారు. అటవీశాఖ సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని, ఈ ప్రాంతంలో చిరుత కదలికలపై ప్రత్యేక నిఘా నిరంతరం కొనసాగుతుందని సబ్ డీఎఫ్ఓ బాలరాజు స్పష్టం చేశారు. అరటి తోట రైతు మదర్ షా మాటల్లో.. చిరుతను చూసిన క్షణంలో భయాందోళనతో మాట్లాడుతూ.. నాలుగు రోజుల క్రితం పొలానికి నీరు కట్టేందుకు వచ్చిన సమయంలో మచ్చలు మచ్చలుగా ఉండి పొడవాటి తోక కలిగిన చిరుత పులి కనిపించిందని తెలిపారు. దాన్ని చూసిన వెంటనే భయపడి తన భార్యకు, గ్రామస్తులకు సమాచారం అందించానన్నారు. ఆ ఘటన తర్వాత భయంతో నాలుగు రోజులుగా పొలానికి కూడా వెళ్లలేదని తెలిపారు. అయితే అటవీశాఖ అధికారులు వచ్చి పరిశీలించి ధైర్యం చెప్పడంతో సోమవారం మళ్లీ పొలానికి వచ్చినట్లు చెప్పారు. అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టడం వల్ల తమకు ధైర్యం కలిగిందని రైతు తెలిపారు. చిరుత గాలింపులో డి ఆర్ ఓ వంశీ కుమారి, ఎఫ్ ఆర్ ఓ వీరా స్వామి లు పాల్గొన్నారు.

# గృహ ప్రవేశ వేడుకకు హాజరైన మంత్రి గొట్టిపాటి





**సంతమాగులూరు, పెన్ పవర్, ఆగస్టు 24**

సంతమాగులూరు మండలం కొమ్మాలపాడు గ్రామంలో సిపాయి బాజీ (మసూద్) నూతన గృహ ప్రవేశ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పాల్గొన్నారు.నూతన గృహ యజమానులకు శుభాకాంక్షలు తెలియజేసి, కుటుంబం సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం కొమ్మాలపాడు గ్రామానికి చెందిన షేక్ బీవీజాన్ కుటుంబంలో బుడే అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకుని మంత్రి గొట్టిపాటి రవికుమార్ వారి ఇంటికి వెళ్లారు.బుడే ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంతమాగులూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తేలప్రోలు రమేష్, మండల టిడిపి అధ్యక్షులు చేవూరు వాసిరెడ్డి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# పత్తి పంటపై రైతులకు అవగాహన కార్యక్రమం





**పెద్ద దోర్నాల పెన్ పవర్ ఆగస్టు 24**

మండలం లోని చిన్నదోర్నాల మరియు చింతల అగ్రహారం గ్రామాల్లో సోమవారం పత్తి పంటను వ్యవసాయ అధికారులు సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా సహాయ వ్యవసాయ సంచాలకులు యర్రగొండపాలెం వారు ఈ వెంకట రమణ మాట్లాడుతూ పత్తి పంట ప్రస్తుతం నీటి యాద్దడికి గురి అయినట్లు గమనించడం జరిగింది. దీని నివారణకు పై పాటుగా 13.0.45 పొటాశియం నైట్రేట్ లేదా యూరియా 2% ఎకరానికి 1 కేజీ పిచికారీ చేసినట్లయితే పంటను 15 రోజుల వరకు కాపాడుకోవచ్చని తెలిపారు. అలాగే ఈ కార్యక్రమం లో మండల వ్యవసాయ అధికారి డి జవహర్ లాల్ నాయక్ పాల్గొని రైతులు సాగు చేసిన ప్రతి పంటను 15.న తేది లోపల ఈ పంట నమోదు చేసుకోవాలని తెలిపారు. అలాగే క్రాప్ ఇన్సూరెన్స్ చేసుకున్న ప్రతి రైతు కూడా మీ యొక్క మొబైల్ నందు సొంతగా ఏ పి ఏ ఐ ఎం ఎస్ 2.0 అప్ ద్వారా పంట నమోదు చేసుకోవచ్చు, అలాగే వ్యవసాయ పథకాలు లబ్ది పొందాలంటే తప్పనిసరిగా భూమి ఉన్న ప్రతి రైతు తప్పనిసరిగా రైతు విశిష్ట నమోదు సంఖ్య కలిగి ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో విఏఏ రాజేంద్ర ప్రసాద్ మరియు రైతులు పాల్గొన్నారు.

# రెండో విడత జ్ఞానజ్యోతి కార్యక్రమంలో పాల్గొన్న సి.డి.పి.ఓ సుధా

**సంతమాగులూరు, (బల్లికురవ) పెన్ పవర్, ఆగస్టు 24**

చిన్ననాటి నుండి అక్షరం నేర్చటానికి చిన్నారులలో ఆసక్తి కలిగే విధంగా అంగన్వాడీ కార్యకర్తలు తమ బోధన విధానంలో నిత్య నూతన శైలిలో ముందుకు పోవాలని సిడిపిఓ సుధ సూచించారు. జ్ఞాన జ్యోతి రెండవ విడత శిక్షణ కార్యక్రమంలో భాగంగా స్థానిక విద్యా వనరుల భవనంలో జరుగుతున్న కార్యక్రమానికి సోమవారం ఆమె హాజరయ్యారు. అక్షరం ద్వారానే నేటితరం విద్యార్థులు అత్యున్నత స్థాయికి చేరగలుగుతారని సిడిపిఓ వివరించారు. నాణ్యమైన పూర్వ ప్రాథమిక విద్యను అందించడానికి ప్రభుత్వం జ్ఞాన జ్యోతి కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. మూడు నుండి ఆరు సంవత్సరాల వయసు వెలిగిన చిన్నారులకు ఆటలు పాటలు బొమ్మల ద్వారా సులభంగా అర్థమయ్యే రీతిలో బోధన అంశాలు కొనసాగాలన్నారు. పిల్లల కోసం రోజువారి కృత్యాలు, బోధన అభ్యాసన సామాగ్రి వినియోగం పై అవగాహన కల్పించారు. శిక్షణ కార్యక్రమంలోని అంశాల ద్వారా తమ అభ్యాసన సామర్థ్యాన్ని మరింత మెరుగుపరుచుకొని, చిన్నారులలోని సృజనాత్మకతను వెలికి తీయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామకృష్ణ, సురేష్, వీరనారాయణ, సూపర్వైజర్లు సలోమి, విజయనిర్మల ,64 కేంద్రాల అంగన్వాడీ కార్యకర్తల పాల్గొన్నారు.



# నూకరాజు కుటుంబానికి న్యాయం చేయాలి

## ఎస్సై వెంకటేశ్వరరెడ్డి కి వినతి పత్రం అందజేసిన బిజెపి నాయకులు



**సి.ఎస్.పురం,పెన్ పవర్ ఆగస్టు 24**

ఏఈ నూకరాజు కుటుంబం ఆత్మహత్యకు దారితీసిన ఘటనపై సమగ్ర దర్యాప్తు నిర్వహించి, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని మండల బిజెపి ఇన్చార్జి కొండిశెట్టి వెంకటరమణయ్య డిమాండ్ చేశారు. రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ ఆదేశాల మేరకు, జిల్లా బిజెపి అధ్యక్షుడు పి.వి. కృష్ణారావు సూచనలతో రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా మండల బిజెపి అధ్యక్షుడు పాశం రామకృష్ణ ఆధ్వర్యంలో బిజెపి నాయకులు సోమవారం మండల కేంద్రంలోని సి.ఎస్.పురం పోలీస్టేషన్లో ఎస్సై పి.వెంకటేశ్వరరెడ్డికి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా బిజెపి సీనియర్ నాయకుడు మండల బిజెపి ఇన్చార్జి కొండిశెట్టి వెంకటరమణయ్య, బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు ఇండ్ల వెంకట సత్యం మాట్లాడుతూ నూకరాజు కుటుంబం ఆత్మహత్యకు దారితీసిన కారణాలను అన్ని కోణాల్లో పరిశీలించి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఏఈ నూకరాజు కుటుంబం యొక్క సంఘటన చాలా తీవ్రమైనదని, ఈ సంఘటనను తెలుసుకుంటే ఆందోళన కలుగుతుందన్నారు వైఎస్సార్సీపీ కాకినాడ నాయకుడి సిఫారసుతో ఇంటర్నేషనల్ స్కూల్లో రైఫిల్ షూటింగ్ శిక్షకునిగా పనిచేస్తున్న సమయంలో సాదిక్ ఖాన్ కు నూకరాజు కుటుంబం పరిచయం ఏర్పడిందని తెలిపారు. ఈ కేసులో మోసము, వంచన, దోపిడి హత్య లవ్ జిహాదీ ఉగ్రవాద హస్తం ఉందన్నారు జిమ్ములు, జుంబా డ్యాన్సులు, సెలూన్, బ్యూటీ పార్లర్ల సెంటర్లు, కార్పొరేట్ సంస్థల కార్యాలయాలు, షాపింగ్ మాల్స్ ప్రధాన కేంద్రాలుగా లవ్ జిహాజీలు పనిచేస్తున్నారు ఆల్ ఉమా ఉగ్రవాదుల కార్యకర్తలు కాకినాడలో దొరికారు జైసే మహమ్మద్ ఉగ్రవాద సంస్థకు చెందినవారు పెద్దాపురంలో దొరికారు వివిధ ప్రాంతాల్లో జిహాది బయటకు వచ్చిందన్నారు ఏఈ నూకరాజు కుటుంబం యొక్క సంఘటన వివరాలు తెలుసుకుంటే ఆందోళన కలుగుతుందని, సాదిక్ ఖాన్ కొన్ని కోట్ల రూపాయల నగదు బంగారం తీసుకుని మళ్లీ మళ్లీ బ్లాక్ మెయిల్ చేయడం ప్రారంభించి ఇంటి మొత్తాన్ని తన గుపిట్లో పెట్టుకుని భర్త అనారోగ్యాన్ని గమనించి అతనికి విషమిచ్చి చంపేసి ఆమె పేరు మీద ఉన్న యావత్ ఆస్తిని తన పేరు రాసి ఏఈ నూకరాజు తను భార్య మనవడు కార్తికేయ సౌజన్య కుటుంబం మొత్తం ఇస్లాం మతం సేకరించాలని కండిషన్ పెట్టి ప్రైవేట్ ఫోటోలు వీడియోలు బయట ప్రపంచాన్ని చెప్పడమే కాకుండా తన భర్తను చంపినట్లు కుమారుడిని కూడా చంపుతానని బెదిరించారు ఏం చేయాలో అర్థం కాక దిక్కుతోచని స్థితిలో జీవితంపై విసుకు చెంది నూకరాజు కుటుంబం ఈ విషయాలన్నీ ఒక ఉత్తరంలో రాసి గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకున్నారు కానీ మనవడు కార్తికేయకు ఈత రావడంతో ప్రాణాలతో బయటపడి ఈ విషయాలు బయటకు వచ్చాయన్నారు నూకరాజు కుటుంబానికి న్యాయం జరిగేలా రాష్ట్ర డిజిపి హోం మంత్రి స్పందించి లవ్ జిహాదీ సాదిక్ ఖాన్ ని కఠినంగా శిక్షించాలని కోరారు ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు పెద్దిరెడ్డి రమణారెడ్డి, సాదు వెంకటేశ్వర్లు, టి లక్ష్మీనారాయణ, గుర్రం నారాయణ, ప్రధాన కార్యదర్శి ఇండ్ల దుర్గాప్రసాద్, మన్నేపల్లి మాల్యాద్రి, బత్తుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# 29న తెలుగు భాషా దినోత్సవ వేడుకలు

## - గిడుగు రామ్మూర్తి 163వ జయంతి సభ

**కల్చరల్ రిపోర్టర్, పెన్ పవర్ ఒంగోలు ఆగస్టు 24**

కళామిత్రమండలి (తెలుగు లోగిలి) సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ఒంగోలులోని సివియన్ రీడింగ్ రూం ఆవరణలో శనివారం సాయంత్రం 5గంటలకు వ్యావహారిక భాషోద్యమ పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి పంతులు 163 జయంతి సందర్భాన్ని పురస్కరించుకొని తెలుగు భాషా దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ నూనె అంకమ్మరావు, సింహాద్రి జ్యోతిర్మయిలు ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా చందూ డ్యాన్స్ అకాడమీ చిన్నారులచే "తెలుగు పాటల పూదోట–ఈపూట" పేరిట నృత్య నీరాజనం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసభలో ప్రముఖ సాహితీవేత్త, ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత, వ్యాఖ్యాత కీ.శే. డా.వంకాయలపాటి రామకృష్ణ స్మారక జీవన సాఫల్య పురస్కారాన్ని సత్తెనపల్లికి చెందిన సీనియర్ పాత్రికేయులు, జిల్లా వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ మాజీ అధ్యక్షులు మారూరి పుల్లారెడ్డికి ప్రదానం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా,వక్తలుగా ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి రాష్ట్ర గౌరవాధ్యక్షులు అన్న నల్లూరి వెంకటేశ్వర్లు, సాహితీ పోషకులు వీరవల్లి సుబ్బారావు (రుద్రయ్య) నరసం రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు తేళ్ళ అరుణ,విశిష్ట అతిథులుగా విశ్రాంత అడిషనల్ ఎస్పీ కొల్లూరు శ్రీనివాసరావు, ప్రముఖ సాహితీవేత్త, మార్కా పురం శ్రీ సాధన డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డా. కప్పగంతుల మధుసూదన్, శ్రీకృష్ణదేవరాయ సాహిత్య సాంస్కృతికసేవాసమితి అధ్యక్షులు కుర్రా ప్రసాద్ బాబు, మిడసల మల్లికార్జునరావు, గుంటూరు సత్యనారాయణ, యు.వి. రత్నం , కేయస్వీ ప్రసాద్, ఓరుగంటి ప్రసాద్ తదితరులు పాల్గొని ప్రసంగిస్తారని నిర్వాహకులు తెలిపారు. అదే రోజు 10 గంటలకు "తెలుగు తల్లి", "కవుల" విగ్రహాలకు పూలాభిషేకం ఉంటుందని, తదుపరి సాయంత్రం 6గంటలకు వేషధారణ పోటీలు, వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు ఉంటాయని తెలిపారు. కె.బాలకోటయ్య, పరాంకుశం కృష్ణవేణి,బీరం అరుణ తదితరులు నిర్వహణ సహకారం అందిస్తారని తెలిపారు. కావున తెలుగు భాషాభిమానులు అందరూ ఈ కార్యక్రమం లో పాల్గొనవలసినదిగా వారు కోరారు.

# కూటమి ప్రభుత్వములో వెలుగొండ ప్రాజెక్ట్ కు మహర్దశ

## ఆర్ కె వలి , గూడంశెట్టి రవికుమార్



**సి.ఎస్.పురం,పెన్ పవర్ ఆగస్టు24**

వెనుకబడిన మార్కాపురం, కనిగిరి ప్రాంత ప్రజలు మూడు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న వెలుగొండ ప్రాజెక్టు కల సాకారం అవుతున్న నేపథ్యంలో ప్రాజెక్టు తొలి దశను ప్రారంభించనున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు టీడీపీ సీనియర్ నాయకులు ఆర్.కె. వలి, మండల జనసేన పార్టీ నాయకులు గూడంశెట్టి రవికుమార్ కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ వెలుగొండ ప్రాజెక్టు ఈ ప్రాంత ప్రజలకు సాగు, తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించడంతో పాటు ఈ ప్రాంతం వ్యవసాయపరంగా మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు.వెలుగొండ ప్రాజెక్టు కోసం ఈ ప్రాంత ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్నారని, గత ప్రభుత్వాల హయాంలో పనులు నత్తనడకన సాగడంతో ప్రజల ఆశలు నిరాశకు గురయ్యాయని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రాజెక్టు పనులపై ప్రత్యేక దృష్టి సారించి ప్రారంభించడం అభినందనీయమన్నారు. ప్రాజెక్టు ద్వారా మార్కాపురం, ప్రకాశం నెల్లూరు కడప జిల్లాల ప్రాంతాల్లో వేలాది ఎకరాలకు సాగునీరు అందడంతో రైతుల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని తెలిపారు. కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి కూటమి ప్రభుత్వ సహకారంతో నిరంతరం కృషి చేస్తున్నారని ఆర్.కె. వలి అన్నారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు రహదారులు, తాగునీరు, సాగునీరు, విద్య, సంక్షేమ రంగాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు.

# పోలింగ్ బూతుల పరిశీలన చేసిన ఎస్సై నాగరాజు



**సంతమాగులూరు, (బల్లికురవ) పెన్ పవర్, ఆగస్టు 24**

స్థానిక సంస్థల ఎన్నికల నగారా మోగించడానికి ప్రభుత్వం సిద్ధం కావడంతో గ్రామీణ ప్రాంతాలలో ఎన్నికల సందడి ఆరంభమైంది. సోమవారం ఎస్ఐ నాగరాజు మండలంలోని కొండాయపాలెం, చెన్నుపల్లి , కొప్పెర పాలెం, ఉప్పుమాగులూరు కోటవారిపాలెం గ్రామాల పరిధిలో పోలింగ్ బూతులను పరిశీలించారు. స్థానిక నేతలు, ఉపాధ్యాయులను అడిగి వివరాలు రాబట్టారు. పోలింగ్ కేంద్రాల పరిధిలో సమస్యల గుర్తిస్తే, సత్వరం ప్రభుత్వానికి నివేదిక అందజేయడం జరుగుతుందన్నారు.

# నార్కెట్పల్లి ప్రధాన రహదారిపై రోడ్డు ప్రమాదం

## ఏల్చూరు--కొమ్మాలపాడు మధ్యలో బోల్తా పడిన లారీ.. ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి





**సంతమాగులూరు, పెన్ పవర్, ఆగస్టు 24**

నార్కట్పల్లి ప్రధాన రహదారిపై సోమవారం తెల్లవారు జామున సుమారు ఐదు గంటల సమయంలో రోడ్డు ప్రమాదం జరిగింది. సంతమాగులూరు మండల పరిధిలోని ఏల్చూరు--కొమ్మాలపాడు గ్రామాల మధ్యలో లారీ బోల్తా పడి ప్రమాదానికి గురైంది. తమిళనాడు రాష్ట్రం తిరుచ్చికి చెందిన లారీ డ్రైవర్ సెల్వం (39) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగపూర్ నుంచి తిరుచ్చి వైపు ఇనుప సామానుతో వెళ్తున్న లారీ (టీఎన్52 ఏబీ 8240) డ్రైవర్ నిద్రమత్తులో అదుపుతప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ సెల్వంకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న సంతమాగులూరు సీఐ పి.శేషగిరిరావు, ఏఎస్సై శ్రీనివాసరావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహానికి పంచనామా నిర్వహించిన అనంతరం పోస్టుమార్టం నిమిత్తం నరసరావుపేటకు తరలించారు. మృతుడికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# సాగర్ నీరు వృథా..

**అధికారుల నిర్లక్ష్యంపై విమర్శలు**

**గార్లదిన్నె నుంచి గొట్లగట్టు వరకు**

**పలు ప్రాంతాల్లో లీకేజీలు**

**పట్టించుకోని అధికారులు**

**నీటి సరఫరా సక్రమంగా లేక ప్రజల ఇబ్బందులు**





**కొనకనమిట్ల పెన్ పవర్ ఆగస్టు 24**

విలువైన సాగర్ జలాలు వృథాగా పోతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని గార్లదిన్నె పంచాయతీ పరిధి ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గార్లదిన్నె పంచాయతీ పరిధి నుంచి గొట్లగట్టు వరకు పలు ప్రాంతాల్లో సాగర్ నీరు రోడ్లపైకి ప్రవహిస్తూ వృథాగా పోతున్నట్లు స్థానికులు చెబుతున్నారు.నీటి లీకేజీలను అరికట్టేందుకు అధికారులు తక్షణ చర్యలు చేపట్టాల్సి ఉన్నప్పటికీ సమస్యను పట్టించుకోకపోవడంతో నీరు వృధాగా పోతుంది.ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో సాగర్ నీటిపై ప్రజలు,రైతులు ఆధారపడుతున్నారు.అయితే పలు ప్రాంతాల్లో నీటి సరఫరా సక్రమంగా లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ప్రజలు చెబుతున్నారు.అవసరమైన సమయంలో నీరు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితుల్లో,మరోవైపు పైపులైన్ల నీటి సరఫరా మార్గాల్లో లీకేజీల కారణంగా పెద్ద మొత్తంలో నీరు వృథాగా పోతుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.గార్లదిన్నె పంచాయతీ పరిధి నుంచి గొట్లగట్టు వరకు సాగర్ నీటి సరఫరా మార్గాలను సంబంధిత అధికారులు పూర్తిస్థాయిలో పరిశీలించి ఎక్కడెక్కడ లీకేజీలు ఉన్నాయో గుర్తించి మరమ్మతులు చెయ్యాలని ప్రజలు కోరుతున్నారు.చిన్నపాటి లీకేజీలను సకాలంలో గుర్తించి మరమ్మతులు చేపట్టకపోవడం వల్ల అవి మరింత తీవ్రమై నీటి వృథా పెరిగే అవకాశం ఉందని చెబుతున్నారు.అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పరిస్థితిని పరిశీలించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

**ఒకవైపు నీటి కొరత.. మరోవైపు వృథా**

గ్రామాల్లో సాగర్ నీటి సరఫరా సక్రమంగా లేక ప్రజలు ఇబ్బందులు పడుతుంటే..అందుబాటులో ఉన్న నీరు వృథాగా పోవడం ఎంతవరకు సమంజసమని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు.నీటి విలువను గుర్తించి ప్రతి చుక్కను పొదుపుగా వినియోగించాల్సిన సమయంలో ఇలా వృథాగా పోవడం వల్ల భవిష్యత్తులో నీటి సమస్య మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.సాగర్ నీరు వృథా అవుతున్న ప్రాంతాలను గుర్తించి వెంటనే లీకేజీలను అరికట్టడంతో పాటు గ్రామాలకు సక్రమంగా నీరు అందేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.అధికారులు స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని,నిర్లక్ష్యం చేస్తే మరింత నీరు వృథా అయ్యే పరిస్థితి ఏర్పడుతుందని స్థానికులు పేర్కొంటున్నారు.

## నారాయణస్వామి ఆదాయం రూ.2,63,540/- లు



**సి ఎస్ పురం, పెన్ పవర్ ఆగస్టు 24**

జిల్లాలో ప్రసిద్ధిగాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానం ఆదివారం ఆదాయం రూ.2,63,540/-లు వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి గిరిరాజు నరసింహబాబు తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిక్కెట్లు అమ్మకం ద్వారా జమ రూ. 91,050/- లు, లడ్డు ప్రసాదం అమ్మకం ద్వారా రూ.37,960/- లు, శాశ్వత అన్నదాన పథకం నకు రూ.1,17,982/- లు, స్వామివారి పంచామృత అభిషేకమునకు రూ.16,548/- లు వచ్చినట్లు తెలిపారు శాశ్వత అన్నదాన పథకమునకు ప్రకాశం జిల్లా దర్శి మండలం రాజంపల్లి గ్రామ వాస్తవ్యులు పణిదపు శ్రీనివాసులు ధర్మపత్ని ప్రమీల కుమారుడు నారాయణస్వామి కుమార్తె నందిని రూ.60,116/- లు అందజేసినట్లు తెలిపారు.

## ఎమ్మెల్యే అశోక్ రెడ్డిని కలిసిన వాసవి కన్యకాపారమేశ్వరి ఆలయ నూతన కమిటీ

**ఎమ్మెల్యేకు సభ్యుల ఘన సన్మానం**




**గిద్దలూరు: పెన్ పవర్ ఆగస్టు 24**

గిద్దలూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయానికి నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు కోటా శ్రీనివాసులు , కమిటీ సభ్యులు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి ని సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డిని నూతన కమిటీ సభ్యులు శాలువా , పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. ఆలయ అభివృద్ధికి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు నూతన కమిటీ సమష్టిగా కృషి చేయాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆశీస్సులతో ఆలయ అభివృద్ధి మరింత ముందుకు సాగాలని, నూతన కమిటీ సభ్యుల పదవీకాలం విజయవంతంగా కొనసాగాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నూతన కమిటీ సభ్యులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## పొదిలిలో ఘనంగా విగ్నేష్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు



**పొదిలి, పెన్ పవర్, ఆగస్టు 24**

పొదిలిలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి తనయుడు కందుల విగ్నేష్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. విగ్నేష్ రెడ్డి బర్తడే వేడుకలను తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఎంతో అట్టహాసంగా నిర్వహించారు. విగ్నేష్ రెడ్డి కూడా సోమవారం నాడు పొదిలికి విచ్చేసి పార్టీ నాయకులు కార్యకర్తలతో కలిసి తన పుట్టినరోజు వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ క్లస్టర్ ఇంచార్జి వరికుంట్ల అనిల్ కుమార్ స్వగృహంలో ఏర్పాటు చేసిన బర్తడే కేక్ ను విగ్నేష్ రెడ్డి కట్ చేసి, అందరినీ ఎంతో ఆహ్లాద పరిచారు. అలాగే పెద్దల ఆశీస్సులను ఆయన తీసుకున్నారు.

## సాదిక్ ఖాన్ పై కఠిన చర్యలు తీసుకోవాలి

**పొదిలి, పెన్ పవర్, ఆగస్టు 24**

లవ్ జిహాదీ సాదిక్ ఖాన్ పై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని భారతీయ జనతా పార్టీ నాయకులు ఫిర్యాదు చేశారు. సోమవారం నాడు మండల బిజెపి అధ్యక్షులు దోర్నాల రమణారెడ్డి ఆధ్వర్యంలో నాయకులు పోలీస్ స్టేషన్లో ఈ మేరకు ఫిర్యాదు చేశారు. పలు ఉగ్రవాద సంస్థల కార్యకలాపాలతో సంబంధాలు కలిగిన కాకినాడ రైఫిల్ ట్రైనర్ సాదిక్ ఖాన్ లవ్ జిహాదీ పేరిట చేసిన అకృత్యాల పట్ల వారు ఫిర్యాదు చేశారు అసిస్టెంట్ ఇంజనీర్ నూకరాజు కుటుంబం సాదిక్ ఖాన్ వేధింపుల వల్ల గోదావరి నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడిన విషయాన్ని వారు ఈ సందర్భంగా ఉద హరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు పలువురు పాల్గొన్నారు.



## మానసిక వికలాంగుడు జాన్సన్ కు నిత్యవసర వస్తువులు పంపిణీ చేసిన దివ్య హెల్పింగ్ హాండ్స్ ఆర్గనైజేషన్

**కొమరోలు మండలం గోహారపల్లె గ్రామానికి చెందిన జాన్సన్ పుట్టుకతోనే మానసిక వికలాంగుడు.**



**కొమరోలు పెన్ పవర్ ఆగస్టు 24**

కొమరోలు మండలం గోహారపల్లి గ్రామానికి చెందిన మానసిక వికలాంగుడైన జాన్సన్ కు దివ్య హెల్పింగ్ హాండ్స్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు లొక్కు శరత్ బాబు సోమవారం 5000 రూపాయలు విలువ చేసే నిత్యవసర వస్తువులు పంపిణీ చేసి తన ధాతృత్వాన్ని మరోసారి చాటుకున్నారు. కొమరోలు మండలం గోహారపల్లె గ్రామానికి చెందిన జాన్సన్ పుట్టుకతోనే మానసిక వికలాంగుడిగా ఉంటూ ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడు. జాన్సన్ ఇబ్బందికర పరిస్థితిలను తెలుసుకున్న దివ్య హెల్పింగ్ హాండ్స్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు లొక్కు శరత్ బాబు దివ్య హెల్పింగ్ హాండ్స్ ఆర్గనైజేషన్ ద్వారా జాన్సన్ కు సహాయం చేసి తమ వంతుగా ఆదుకోవాలని నిర్ణయించుకున్నాడు. ఆ మేరకు 5,000 రూపాయలు విలువ చేసే నిత్యవసర వస్తువులను కొనుగోలు చేసి సోమవారం గోహారపల్లి గ్రామానికి వెళ్లి మానసిక వికలాంగులైన జాన్సన్ కు నిత్యవసరకులు అందించి ధైర్యం చెప్పారు. తన దీనస్థితిని తెలుసుకొని తనకు సహాయం చేసిన దివ్య హెల్పింగ్ హాండ్స్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు లొక్కు శరత్ బాబుకు, దివ్య హెల్పింగ్ హాండ్స్ ఆర్గనైజేషన్ సభ్యులకు, జాన్సన్, అతని కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. ఆ కార్యక్రమంలో శరత్ బాబు తో పాటు ఫ్రెండ్స్ ఆర్గనైజేషన్ ఫర్ రూరల్ డెవలప్మెంట్ అధ్యక్షులు డాక్టర్ బిజ్జం చిన్న నర్సయ్య, ఫోటోగ్రాఫర్ సుబ్బరాయుడు, రాజశేఖర్, పాస్టర్ విజయ్, బిజ్జం నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

## పేదల పాలిట వరం సీఎం సహాయనిధి 145 మందికి రూ.1.24 కోట్ల చెక్కుల పంపిణీ

**లబ్ధిదారులకు చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే కందుల, తనయుడు విగ్నేష్ రెడ్డి**






**మార్కాపురం పెన్ పవర్ ఆగస్టు 24**

పేదల పాలిట సీఎం సహాయనిధి ఒక వరం లాంటిదని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు.సోమవారం స్థానిక టిడిపి కార్యాలయంలో సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు.అదేవిధంగా పుట్టినరోజు జరుపుకుంటున్న వారి కుమారుడు విగ్నేష్ రెడ్డి తర్లుపాడు, గొట్లగట్టు, పొదిలి పట్టణాల్లో ఆయా మండలాలకు చెందిన లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు.ఒక్కరోజే 145 మంది లబ్ధిదారులకు సుమారు 1 కోటి 24 లక్షల రూపాయల విలువైన సీఎం సహాయనిధి చెక్కులు, ఎల్ ఓ సి లను పంపిణీ చేయడం విశేషం.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందుల మాట్లాడుతూ అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందిన తర్వాత పేదలు అప్పులపాలు కాకుండా సీఎం సహాయనిధి ఆదుకుంటుందన్నారు. ఇప్పటివరకు మార్కాపురం నియోజకవర్గంలో సుమారు 2,000 మందికి సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేశామని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేదల పాలిట దైవమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు

## సురభేశ్వర కొనల్లో సురభేశ్వరునికి ప్రత్యేక అభిషేకాలు

**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 24**

గిద్దలూరు నియోజకవర్గంలో గుండ్లకమ్మ నది ఒడ్డున వెలసిన సురభేశ్వర కొనలో శ్రావణమాసం సోమవారం నాడు మహా శివునికి, అమ్మవారికి ప్రత్యక పూజలు నిర్వహించారు. శ్రవణ మాసం కావటంతో భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా మహా శివునికిఆలయ అర్చకులు మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు.అమ్మవారికి కుంకుమార్చన లు నిర్వహించారు. దశాబ్దాల చరిత్ర కలిగిన ఈ ఆలయం అపురూప శిల్ప సౌదర్యంతో అలరారుతుంది. ఈ స్వామి ఎంతో మహిమగల స్వామి. ఈలయాన్ని గుప్త నిధుల కోసం దుండగులు పలు మార్లు తవ్వకాలు చేశారు. ఎన్ని అవాంతరాలు జరిగినా స్వామి మహిమతో అట్లే నెలకొని ఉంది. మహాశివరాత్రి పర్వదినం మూడురోజులు ఇక్కడ వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ఆసమయంలో వేలాదిగా భక్తులు కొనకు తరలి వస్తారు కొనల్లో శివరాత్రి తిరునాళ్ళు చూచి తీరాల్సిందే



## ఘనంగా భగవాన్ శ్రీ వెంకయ్య స్వామి వారి 44వ ఆరాధన మహోత్సవం



**దొనకొండ ఆగస్టు 24 పెన్ పవర్**

మండల కేంద్రంలోని విరాట్ నగర్ లో గల శ్రీ ఆనంద ఆశ్రమంలో గొలగమూడి అవధూత భగవానుశ్రీ వెంకయ్య స్వామి వారి 44వ ఆరాధన మహోత్సవం ఘనంగా నిర్వహించారు ఉదయం 6 గంటల నుండి స్వామివారి చిత్రపటమునకు ప్రత్యేక పూజలు నిర్వహించి పొంగలి మహా నైవేద్యం సమర్పించి కర్పూర హారతులు ఇచ్చారు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు వచ్చిన భక్తులకు ఉభయ దాతలు దొనకొండ వాస్తవ్యులు కదం వెంకటేశ్వర్లు ఇండ్ల శ్రీనివాస్ తిరువాయిపాటి రామానుజయ వచ్చిన భక్తులకు అన్నదానం నిర్వహించారు కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలు పాల్గొన్నారు వచ్చిన భక్తులకు భైరవానంద స్వామి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## వికలాంగునికి ట్రై సైకిల్ ను అందజేసిన డాక్టర్ ప్రీతం కృష్ణ



**పొదిలి, పెన్ పవర్, ఆగస్టు 24**

మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి తనయుడు కందుల విగ్నేష్ రెడ్డి పుట్టినరోజు వేడుకలను స్థానిక గీతా నర్సింగ్ హోమ్ లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విగ్నేష్ రెడ్డి బర్త్ డే కేక్ ను కట్ చేసి , అందరికీ పంచి పెట్టారు. అలాగే ఈ సందర్భంగా స్వర్ణ గీత తనయుడు డాక్టర్ స్వర్ణ ప్రీతం కృష్ణ తన సొంత నిధులతో కొనుగోలు చేసిన ట్రై సైకిల్ ను వికలాంగునికి అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికలు - శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి

### ఎన్నికల వేళ అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలి - సీఐ శేషగిరిరావు

### ప్రశాంత ఎన్నికలకు ప్రజలు సహకరించాలని సూచన -శాంతి భద్రతలపై ప్రజలు బాధ్యతగా మెలగాలి





**సంతమాగులూరు, పెన్ పవర్ ఆగస్టు 24**

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సంతమాగులూరు సీఐ శేషగిరిరావు హెచ్చరించారు. ఎన్నికల సందర్భంగా గ్రామాల్లో రాజకీయ పరిస్థితులను ముందుగానే అంచనా వేసి, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పోలీసు నిఘాను ముమ్మరం చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా సోమవారం సాయంత్రం తంగేడుమల్లి, మిన్నెకళ్ళు గ్రామాల్లో పర్యటించిన సీఐ శేషగిరిరావు గ్రామస్థులతో మాట్లాడి స్థానిక రాజకీయ పరిస్థితులు, ఎన్నికల నేపథ్యంలో నెలకొన్న పరిస్థితులపై ఆరా తీశారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని సూచించారు. రాజకీయ విభేదాలు, పాత కక్షలు, వ్యక్తిగత వివాదాలు ఎన్నికల సమయంలో ఘర్షణలకు దారితీయకుండా సంయమనం పాటించాలని కోరారు. ప్రత్యర్థి వర్గాలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు, వివాదాలకు దారితీసే చర్యలు, సామాజిక మాధ్యమాల్లో రెచ్చగొట్టే ప్రచారాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తుల కదలికలపై నిఘా ఉంచడంతో పాటు, అవసరమైన చోట ముందస్తు చర్యలు చేపడతామని సీఐ తెలిపారు. ఎన్నికల సమయంలో ఓటర్లు ఎలాంటి ఒత్తిళ్లకు, బెదిరింపులకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునే వాతావరణం కల్పించడమే పోలీసుల ప్రధాన లక్ష్యమన్నారు. అనుమానాస్పద పరిణామాలు, గొడవలకు దారితీసే పరిస్థితులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని గ్రామస్థులకు సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో రాజకీయ వాతావరణం మరింత వేడెక్కే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని సీఐ శేషగిరిరావు కోరారు.

## సజ్జల రామకృష్ణా రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసిన దద్దాల



**సి ఎస్ పురం, పెన్ పవర్ ఆగస్టు 24**

తాడేపల్లి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ శ్రీ సజ్జల రామకృష్ణారెడ్డి ని సోమవారం కనిగిరి నియోజకవర్గ వైయస్ఆర్ సీపీ ఇంచార్జ్ డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ మర్యాద పూర్వకంగా కలిశారు ఈ సందర్భంగా దుశ్శాలువతో ఆయనను ఘనంగా సన్మానించారు. అనంతరం నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాలు,పార్టీ బలోపేతం మరియు త్వరలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై పలు విషయాలు చర్చించారు.ఈ కార్యక్రమం లో నాగిరెడ్డిపల్లి మాజీ సర్పంచ్ సైకం స్వర్ణ ఏడుకొండలు రెడ్డి పాల్గొన్నారు.

## టీటీడీ కల్యాణ మండపం అత్యాధునికీకరణకు చర్యలు

### స్థలాలను పరిశీలించిన కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

### సమగ్ర సర్వే నివేదిక సమర్పించాలని ఆదేశం

**విశాఖపట్నం, (పెన్ పవర్) ఆగస్టు 24**

నగరంలోని టీటీడీ కల్యాణ మండపాన్ని రాష్ట్రంలోనే అత్యుత్తమంగా, అత్యాధునిక సదుపాయాలతో పునరాభివృద్ధి చేసేందుకు కార్యాచరణ చేపడుతున్నట్లు విశాఖ జిల్లా కలెక్టర్, జీవీఎంసీ ప్రత్యేక అధికారి ఎం. అభిషిక్త్ కిషోర్ తెలిపారు. సోమవారం జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్‌తో కలిసి ఆయన ఎంవీపీ కాలనీలోని టీటీడీ కల్యాణ మండపం, కార్యాలయ భవనం, ఖాళీ స్థలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా స్థలాల విస్తీర్ణం, ప్రస్తుత వినియోగ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పరిసర భవనాలు, ఖాళీ ప్రదేశాలపై పూర్తి వివరాలతో సమగ్ర సర్వే నిర్వహించి వెంటనే నివేదిక సమర్పించాలని రెవెన్యూ, టీటీడీ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ కె. శివప్రసాద్, తహసీల్దార్ ప్రసాద్, టీటీడీ మేనేజర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన సంక్షేమ వసతి గృహాలను పరిశీలించిన డైరెక్టర్ భార్గవి

**విశాఖపట్నం (పెన్ పవర్) ఆగస్టు 24:**

గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ ఎస్. భార్గవి సోమవారం సాయంత్రం విశాఖపట్నంలోని ఎంవీపీ కాలనీ-1, 2 మహిళా వసతి గృహాలను సందర్శించి, అక్కడి వసతులను పరిశీలించారు. వసతి గృహాల్లో విద్యార్థినులకు అందిస్తున్న భోజనం, వసతి, ఇతర మౌలిక సదుపాయాలను పరిశీలించిన ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థినులకు నాణ్యమైన భోజనం, మెరుగైన వసతులు అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. జిల్లా గిరిజన సంక్షేమ అధికారి సురేష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య సంఘం ఎన్నికలా!!!

# ‘బల నిరూపణేనా’

### పెద్దల సమక్షంలో కుదిరిన అధ్యక్షుల ఏకగ్రీవ ఒప్పందం

### సభ్యుల పట్టుతో అనివార్యమైన రెండు వర్గాల మధ్య పోరు హోరాహోరీగా సాగిన బలప్రదర్శన

### సార్వత్రిక ఎన్నికల మించి ధనం ఖర్చు -గొడుగులు చీరలు , పంచలు పంపిణీ

**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 24**

గిద్దలూరు శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి (ఆర్యవైశ్య సంఘం) దేవస్థాన అధ్యక్ష పదవి ఎంపిక అంశం అమ్మవారి సన్నిధిలో పెద్దల సమక్షంలో ‘ధర్మ చీటీల’ ప్రక్రియ ద్వారా ప్రశాంతంగా ముగిసినప్పటికీ, క్షేత్రస్థాయిలో చోటుచేసుకున్న పరిణామాలు మాత్రం రసవత్తరంగా ఉత్కంఠ భరితంగా సాగాయి. అమ్మవారి సన్నిధిలో నిర్వహించిన ధర్మ చీటీల ఎంపిక ప్రక్రియ ప్రకారం.. 2026-2027 సంవత్సర కాలానికి కోటా శ్రీనివాసులు, 2027-2028 సంవత్సర కాలానికి పరుచూరు వెంకట నాగేశ్వర రావులు అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఆర్య వైశ్య పెద్దలు కలుగచేసుకోకుంటే ఎన్నికల పోరు తీవ్రరూపం దాల్చేది కానీ ఆర్య వైశ్యలు గ్రూపులుగా చీలి పోయేవారు పెద్దల నిర్ణయంతో తొలి అడుగు సజావుగా పడింది కొంత ఉపశమన కలిగింది. అయితే అధ్యక్ష పదవి ఎంపిక రాజీ మార్గంలో ఏకగ్రీవంగా ముగిసినప్పటికీ, పట్టణంలోని 15 హద్దుల పరిధిలోని హద్దుకు ఇద్దరు చొప్పున సంఘ సభ్యులు మాత్రం ఎన్నికల ద్వారానే తమ సత్తా చాటుకుంటామన్నారు. దీంతో వెనక్కి తగ్గని ఇద్దరు అధ్యక్ష అభ్యర్థులు కోటా శ్రీనివాసులు, పరుచూరు వెంకట నాగేశ్వర రావులు తమ బలాన్ని నిరూపించుకునేందుకు సిద్ధమయ్యారు. రంగంలోకి వారి వారి అనుకూలురను దించారు ఇందులో భాగంగా ఇరువర్గాలూ హద్దుకు ఇద్దరు చొప్పున 15 హద్దులకు అభ్యర్థులను బలపరిచారు. ఈ క్రమంలో ఆదివారం అత్యంత ఉత్కంఠభరితంగా ఉద్రిక్తత తో జరిగిన ఎన్నికల్లో, కోటా శ్రీనివాసులు బలపరిచిన అభ్యర్థులలో అత్యధిక మంది విజయం సాధించి తమ సత్తా చాటుకున్నారు. ఎన్నికల శైలిని నిశితంగా గమనించిన గిద్దలూరు పట్టణ వాసులు మాత్రం ఇది సాధారణ ఆర్యవైశ్య సంఘం ఎన్నికలలా లేదని, అక్షరాలా ఇరువర్గాల మధ్య జరిగిన ‘బల నిరూపణ’ అని బహిరంగంగా నే అభివర్ణిస్తున్నారు.అధ్యక్ష పదవి ఏకగ్రీవం అయినప్పటికీ ఈ స్థాయిలో సభ్యుల ఎన్నికకు ఎందుకు పోటీ పెట్టవలసి వచ్చింది, అసలు ఈ బల ప్రదర్శన వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటనే ప్రశ్నలు ప్రస్తుతం స్థానికంగా జోరుగా పుకార్లు సాగుతున్నాయి .



## అద్దంకి పురపాలక అధికారులతో మంత్రి గొట్టిపాటి రవికుమార్ సమీక్ష

### తాగునీరు, మౌలిక వసతుల పనుల్లో వేగం పెంచాలని ఆదేశం



**అద్దంకి, ఆర్.సి (పెన్ పవర్) ఆగస్టు 24:**

అద్దంకి పట్టణంలో చేపడుతున్న అభివృద్ధి పనులు, మౌలిక వసతుల కల్పనపై రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పురపాలక అధికారులతో విస్తృత స్థాయి సమీక్ష నిర్వహించారు. స్థానిక కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో సమగ్ర తాగునీటి సరఫరా పథకం పనుల పురోగతిని ఆయన అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు నిరంతరాయంగా నాణ్యమైన తాగునీరు అందించేలా పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. పట్టణ పరిధిలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులపై మంత్రి పలు సూచనలు చేశారు. ప్రజలకు నేరుగా ఉపయోగపడే మౌలిక వసతుల కల్పనకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయడంతో పాటు కచ్చితంగా నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. పనుల్లో ఎదురయ్యే ఆటంకాలను వివిధ శాఖల సమన్వయంతో ఎప్పటికప్పుడు పరిష్కరించుకోవాలని సూచించారు. పట్టణంలో వీధి దీపాల నిర్వహణపై మంత్రి ప్రత్యేకంగా దృష్టి సారించారు. పనిచేయని దీపాలను తక్షణమే గుర్తించి మరమ్మతులు చేయాలని, అవసరమైన చోట కొత్తవి ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రాత్రి వేళల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు. అలాగే అద్దంకి జూనియర్ కళాశాలలో విద్యార్థులు, యువత కోసం వ్యాయామశాల, బ్యాడ్మింటన్ క్రీడా ప్రాంగణం నిర్మాణానికి అవసరమైన అంచనాలను వెంటనే సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించడమే ప్రభుత్వ ధ్యేయమని మంత్రి గొట్టిపాటి ఉద్ఘాటించారు.



## స్థానిక ఎన్నికలపై ప్రజలకు అవగాహన - ఎస్సై నాగరాజు

### ప్రజా సమస్యలు శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి

**సంతమాగులూరు, (బల్లికురవ) పెన్ పవర్, ఆగస్టు 24**

ప్రజలతో నేరుగా మాట్లాడి, పల్లె ప్రజల సమస్యలు తెలుసుకోవడంతో పాటు, శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజల వంతు పాత్ర వివరించేందుకు పోలీసు శాఖ గ్రామ సందర్శన కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ కార్యక్రమంలో భాగంగా సోమవారం రాత్రి వేమవరం గ్రామంలో ఎస్సై నాగరాజు ప్రజలతో మాట్లాడారు. పోలీసు సిబ్బంది గ్రామస్తులతో మమేకం కావటం, స్థానిక ప్రజల సమస్యలు గుర్తించి వాటికి పరిష్కార మార్గాలు చూపటం, స్థానిక ఎన్నికలు సమీపించనున్న నేపథ్యంలో, శాంతి భద్రతల పట్ల వారిలో అవగాహన కల్పించడం లాంటి విషయాలను ప్రధానంగా మాట్లాడారు. సైబర్ నేరాలు , మహిళలు, పిల్లల భద్రతపై, ప్రత్యేక సూచనలు చేశారు.

## పర్యావరణ పరిరక్షణలో ఏపీని అగ్రస్థానంలో నిలపాలి

### ఎన్జీసీ రాష్ట్ర డైరెక్టర్ పి. స్రవంతి





**విశాఖపట్నం, పెన్ పవర్, ఆగస్టు 24**

పర్యావరణ విద్య ద్వారానే ప్రకృతి హిత జీవన విధానం సాధ్యమవుతుందని నేషనల్ గ్రీన్ కార్ప్స్ (ఎన్జీసీ) ఏపీ స్టేట్ డైరెక్టర్ పి. స్రవంతి స్పష్టం చేశారు. రాజమండ్రి లారెల్ గ్లోబల్ హైస్కూల్‌లో నిర్వహించిన రాష్ట్ర సదస్సులో ఆమె మాట్లాడుతూ, విద్యాసంస్థల్లో విరివిగా మొక్కలు నాటాలని, నిర్వహించే ప్రతి పర్యావరణ కార్యక్రమాన్ని జీపీఎస్ ఫొటోలు, వీడియోలతో సహా ‘ప్రకృతి’ వెబ్‌సైట్‌లో తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. దేశవ్యాప్తంగా ఎన్జీసీ కార్యక్రమాల్లో రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలిపేందుకు సమన్వయకర్తలు, ఉపాధ్యాయులు సైనికుల్లా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సులో ఎన్జీసీ రాష్ట్ర సమన్వయకర్త పి. నీలకంఠయ్య విద్యార్థుల భాగస్వామ్యంపై దిశానిర్దేశం చేయగా, విజయనగరం జిల్లా సమన్వయకర్త బి. వేణుగోపాల్ రావు కార్యక్రమాల నిర్వహణ, నివేదికల సమర్పణపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. గ్రీన్ క్లైమేట్ సంస్థ ప్రతినిధి జేవీ రత్నం విత్తనాల రాఖీల తయారీ, వృక్షాబంధన్‌పై శిక్షణ ఇచ్చారు. వ్యర్థాల నుంచి ఆదాయం పొందే విధానంపై కృష్ణా జిల్లా సమన్వయకర్త కృష్ణవేణి నిర్వహించిన పేపర్, క్లాత్ బ్యాగుల ప్రదర్శన, మండపేట ఆర్ట్ ఇన్‌స్టిట్యూట్ విద్యార్థుల చిత్రలేఖనాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రతినిధి సుంకరి రవికుమార్, వివిధ జిల్లాల సమన్వయకర్తలు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రేపు 12, 13 వార్డుల్లో తాగునీటి సరఫరా బంద్

### పంపింగ్ లైన్ ఇంటర్ కనెక్షన్ పనులే కారణం

### ఈఈ సుధాకర్ వెల్లడి

**విశాఖపట్నం, పెన్ పవర్, ఆగస్టు 24**

ముడసరలోవ రిజర్వాయర్‌కు చెందిన 350 ఎం.ఎం. పంపింగ్ లైన్ ఇంటర్ కనెక్షన్ పనుల కారణంగా మంగళవారం జీవీఎంసీ పరిధిలోని 12, 13 వార్డుల్లో తాగునీటి సరఫరా నిలిచిపోనున్నట్లు మంచినీటి విభాగం ఈఈ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. దీనివల్ల 13వ వార్డులోని భగత్‌సింగ్ నగర్, 40 గజాల రోడ్డుతో పాటు 12వ వార్డు పరిధిలోని నెహ్రూ నగర్-1 ఢ 2, దుర్గానగర్, ఎర్నీ దుర్గానగర్ ప్రాంతాల్లో నీటి సరఫరా ఉండదని పేర్కొన్నారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా అత్యవసర ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తామని, ప్రజలు జీవీఎంసీకి సహకరించాలని ఆయన కోరారు.

## దివ్యాంగుడి వద్దకే వెళ్లి సమస్య విన్న కలెక్టర్

### పరిష్కారానికి భరోసా..

### ఇంటికే అధికారులను పంపుతామని హామీ



**విశాఖపట్నం, పెన్ పవర్, ఆగస్టు 24**

ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో పాల్గొనేందుకు కలెక్టరేట్‌కు వచ్చిన జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు. కలెక్టర్ తన వాహనం దిగి కార్యాలయ మెట్లు ఎక్కుతుండగా, అదే సమయంలో రెడ్‌క్రాస్ వాలంటీర్ సహాయంతో లిఫ్ట్ వైపు వెళ్తున్న ఓ దివ్యాంగుడు ఆయన దృష్టిలో పడ్డారు. వెంటనే ఆగి స్వయంగా ఆ దివ్యాంగుడి వద్దకు వెళ్లిన కలెక్టర్, “ఏమైంది.. మీ సమస్య ఏమిటి?” అంటూ ఆప్యాయంగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. భీమిలి మండలం చిప్పాడ గ్రామానికి చెందిన జి. రాంబాబు అనే ఈ దివ్యాంగుడికి ప్రస్తుతం వికలాంగుల కోటాలో నెలకు రూ.6,000 పింఛను అందుతోంది. కూలీ పనులతో జీవనం సాగించే తమకు రాంబాబు పోషణకు ఈ మొత్తం సరిపోవడం లేదని, బెడ్ రిడెన్ కేటగిరీ కింద నెలకు రూ.15,000 పింఛను మంజూరు చేయాలని అతని తల్లిదండ్రులు కలెక్టర్‌కు విన్నవించారు. దీనిపై తక్షణమే స్పందించిన కలెక్టర్, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. తీవ్ర ఇబ్బందులు పడుతూ రాంబాబును మళ్లీ కలెక్టరేట్‌కు తీసుకురావద్దని, పరిశీలనకు అధికారులే నేరుగా ఇంటికి వస్తారని వారికి భరోసా కల్పించారు. సమస్య చెప్పుకోవడానికి ప్రత్యేకంగా కలవాల్సిన అవసరం లేకుండా, కలెక్టరే తమ వద్దకు వచ్చి గోడు వినడం పట్ల రాంబాబు తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

# జూరెల్ అద్భుత సెంచరీ.. 503/9 వద్ద భారత్ ఇన్నింగ్స్ డిక్లేర్డ్

- శ్రీలంకతో రెండో టెస్టులో శతకంతో మెరిసిన ధ్రువ్ జూరెల్
- 503/9 పరుగుల భారీ స్కోరు వద్ద తొలి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసిన భారత్
- దేవదత్ పడిక్కల్ (117), జూరెల్ (115లి) సెంచరీలతో పటిష్ఠ స్థితి
- లంక బౌలర్లలో అసిత్ ఫెర్నాండోకు నాలుగు వికెట్లు
- రెండో రోజు ఆట ముగిసేలోపు బ్యాటింగ్ ప్రారంభించనున్న శ్రీలంక




**హైదరాబాద్ పెన్ పవర్:** కొలంబోలోని సింహళీస్ స్పోర్ట్స్ క్లబ్ గ్రౌండ్‌లో శ్రీలంకతో జరుగుతున్న రెండో టెస్టులో భారత్ పట్టు బిగించింది. వికెట్ కీపర్ బ్యాటర్ ధ్రువ్ జూరెల్ (115 నాటౌట్) అద్భుత సెంచరీతో కదం తొక్కడంతో టీమిండియా తన తొలి ఇన్నింగ్స్‌ను 138 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 503 పరుగుల భారీ స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. అంతకుముందు దేవదత్ పడిక్కల్ (117) కూడా శతకంతో రాణించడంతో లంక ముందు భారత్ భారీ ఆధిక్యాన్ని ఉంచేందుకు మార్గం సుగమం చేసుకుంది.రెండో రోజు ఆటకు వర్షం కారణంగా అంతరాయం కలిగింది. తిరిగి ఆట మొదలయ్యే సమయానికి జూరెల్ 95 పరుగులతో తన తొలి టెస్టు శతకానికి కేవలం ఐదు పరుగుల దూరంలో ఉన్నాడు. మహమ్మద్ సిరాజ్‌తో కలిసి ఇన్నింగ్స్ పునఃప్రారంభించిన జూరెల్.. సెంచరీ కోసం ఆచితూచి ఆడాడు. సింగిల్స్‌ను కట్టడి చేసేందుకు లంక ఫీల్డర్లు చుట్టూ మోహరించినా, జూరెల్ సంయమనం కోల్పోలేదు. దాదాపు 22 బంతుల నిరీక్షణ తర్వాత ఫెర్నాండో బౌలింగ్‌లో బంతిని బౌలర్ తల మీదుగా డ్రైవ్ చేసి, వేగంగా పరుగెత్తి శతకాన్ని పూర్తి చేసుకున్నాడు. ఈ క్రమంలో రనౌట్ ప్రమాదం నుంచి తృటిలో తప్పించుకున్నాడు. సెంచరీ పూర్తి కాగానే తన చేతిపై ఉన్న 'జై జవాన్, జై కిసాన్' అనే టాటూను చూపిస్తూ అభివాదం చేయడం ప్రత్యేకంగా నిలిచింది.శతకం పూర్తయ్యాక జూరెల్ తన దూకుడు పెంచాడు. ఫెర్నాండో బౌలింగ్‌లో లాంగ్-ఆన్ మీదుగా భారీ సిక్సర్ బాదాడు. మరోవైపు, 29 బంతులు ఆడిన సిరాజ్‌ను ప్రభాత్ జయసూర్య ఎల్బీడబ్ల్యూగా వెనక్కి పంపాడు. భారత్ తీసుకున్న రివ్యూ విఫలమైంది. అనంతరం క్రీజులోకి వచ్చిన ప్రసిద్ధ్ కృష్ణతో కలిసి జూరెల్ తన జోరు కొనసాగించాడు. ఫెర్నాండో బౌలింగ్‌లోనే డీప్ బ్యాక్‌వర్డ్ స్క్వేర్ లెగ్ మీదుగా మరో సిక్సర్ కొట్టాడు. ఆ తర్వాత ప్రసిద్ధ్ కవర్స్ మీదుగా ఫోర్ కొట్టడంతో భారత స్కోరు 500 మార్కును దాటింది. వెంటనే కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేస్తున్నట్లు సంకేతాలిచ్చాడు.

ఈ ఇన్నింగ్స్‌లో జూరెల్ లోయర్ ఆర్డర్‌తో కలిసి కీలక భాగస్వామ్యాలు నెలకొల్పాడు. ముఖ్యంగా రిషభ్ పంత్ (63)తో కలిసి 112 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పడం విశేషం. శ్రీలంక బౌలర్లలో అసిత్ ఫెర్నాండో 106 పరుగులిచ్చి 4 వికెట్లతో సత్తా చాటగా, ప్రభాత్ జయసూర్య, కేశార నువంత రెండేసి వికెట్లు పడగొట్టారు. రెండో రోజు ఆట ముగియడానికి సుమారు గంట సమయం ఉండగా, శ్రీలంక తమ తొలి ఇన్నింగ్స్‌ను ప్రారంభించనుంది.

# మైదానంలో గొడవ.. జైస్వాల్, ఫెర్నాండోపై ఐసీసీ కఠిన చర్యలు

**జైస్వాల్, ఫెర్నాండో మ్యాచ్ ఫీజులో 25 శాతం కోత**
**ఇద్దరికీ చెరో డీమెరిట్ పాయింట్**
**ఐసీసీ ఆర్టికల్ 2.12 కింద చర్యలు**
**తమ తప్పును అంగీకరించిన ఇద్దరు ప్లేయర్లు**
**అధికారిక విచారణ లేకుండానే శిక్ష ఖరారు**




**హైదరాబాద్ పెన్ పవర్:** రెండో టెస్టు తొలి రోజే మైదానంలో చోటుచేసుకున్న వివాదంపై ఐసీసీ చర్యలు తీసుకుంది. భారత బ్యాటర్ యశస్వి జైస్వాల్, శ్రీలంక పేసర్ అసిత ఫెర్నాండోకు జరిమానా విధించింది. ఇద్దరి మ్యాచ్ ఫీజులో 25 శాతం కోత విధిస్తూ నిర్ణయం తీసుకుంది. చెరో డీమెరిట్ పాయింట్ కూడా ఇచ్చింది.

**ఏం జరిగిందంటే..**

'సింహళీస్ స్పోర్ట్స్ క్లబ్' మైదానంలో జరుగుతున్న రెండో టెస్టు తొలి రోజున 17వ ఓవర్‌లో ఈ ఘటన జరిగింది. ఫెర్నాండో వేసిన బంతికి జైస్వాల్ బౌల్డ్ అయ్యాడు. పెవిలియన్‌కు వెళ్తున్న సమయంలో బౌలర్ ఏదో అన్నట్లు జైస్వాల్ భావించాడు. దీంతో తిరిగి వచ్చి ఫెర్నాండోతో వాగ్వాదానికి దిగాడు. ఈ క్రమంలో ఇద్దరూ దాదాపు తలలు తాకించుకున్నారు. వెంటనే సహచరులు జోక్యం చేసుకుని వారిని విడదీశారు.

**ఐసీసీ నిబంధన ఉల్లంఘన**

ఇద్దరూ ఐసీసీ ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.12ను ఉల్లంఘించినట్లు తేలింది. అంతర్జాతీయ మ్యాచ్‌లో ఆటగాడు, సహాయక సిబ్బంది, అంపైర్, మ్యాచ్ రిఫరీ లేదా ఇతర వ్యక్తితో అనుచితంగా శారీరకంగా వ్యవహరించడాన్ని ఈ నిబంధన తప్పుబడుతుంది. మ్యాచ్ రిఫరీ ఆండీ పైక్రాఫ్ట్ ఈ శిక్షలను ప్రతిపాదించారు. జైస్వాల్, ఫెర్నాండో తప్పును అంగీకరించడంతో అధికారిక విచారణ అవసరం లేకుండానే చర్యలు ఖరారయ్యాయి. గత 24 నెలల్లో ఇద్దరికీ డీమెరిట్ పాయింట్లు లేకపోవడం గమనార్హం.

**జైస్వాల్‌కు భోగ్లే సూచన**

జైస్వాల్ తీరుపై క్రికెట్ వ్యాఖ్యాత హర్షా భోగ్లే స్పందించారు. ఔటైన తర్వాత జైస్వాల్ నేరుగా వెళ్లిపోవాల్సిందని సూచించారు. దీనిపై జైస్వాల్ ఘాటుగా స్పందించాడు. ఏం జరిగిందో తెలియకుండా తీర్పు ఇవ్వొద్దని కోరాడు. ఎవరైనా హద్దులు దాటితే భారత్ పోరాడుతుందని పేర్కొన్నాడు.

**కోటక్ ఏమన్నారంటే..**

భారత బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్ కూడా ఘటనపై స్పందించారు. ఆ సమయంలో భావోద్వేగాలు అదుపు తప్పి ఉండొచ్చన్నారు. అయితే ఫెర్నాండోకు అంత దగ్గరగా వెళ్లి శారీరకంగా తాకడం జైస్వాల్ చేయకూడదని స్పష్టం చేశారు.

# 19 ఏళ్ల తర్వాత పాకిస్థాన్‌కు భారత్?: 2027 సౌత్ ఏషియన్ గేమ్స్‌పై బిగ్ ట్విస్ట్!







**హైదరాబాద్ పెన్ పవర్:** కొలంబో నుంచి లాహోర్ వరకు స్పోర్ట్స్ సీన్ చాలా కలర్‌ఫుల్‌గా మారుతోంది భయ్యా. 2027 మార్చి 3 నుంచి 11వ తేదీ వరకు ఇస్లామాబాద్, లాహోర్, పెషావర్లలో జరగబోయే సౌత్ ఏషియన్ గేమ్స్‌కి భారత్ హాజరవుతుందనే వార్త ఇప్పుడు నెట్టింట్లో ఫుల్ ట్రెండింగ్‌గా మారింది. నీరజ్ చోప్రా వంటి స్టార్ అథ్లెట్లు పాకిస్థాన్‌లో ల్యాండ్ అయి ఈటె విసిరితే ఎలా ఉంటుందో అని లంక నుంచి పాక్ మీడియా వరకు అందరూ ఊహించుకుంటూ తెగ ప్రచారం చేసే పనిలో పడ్డారు. భారత్ తో సహా 7 దేశాలు పాల్గొనే ఈ మెగా టోర్నీ కోసం అప్పుడే కౌంట్‌డౌన్ స్టార్ట్ అయిపోయింది.26/11, పుల్వామా, పహల్గామ్ ఘటనల తర్వాత పాకిస్థాన్ పేరు వింటేనే ఇండియన్స్ వైబ్స్ పూర్తిగా పాడైపోయాయి. ఇస్లామాబాద్‌లో జరిగిన సౌత్ ఏషియా ఒలింపిక్ కౌన్సిల్ మీటింగ్‌కి బంగ్లాదేశ్, నేపాల్ వాళ్లు నేరుగా వెళ్తే, మన భారత డెలిగేషన్ మాత్రం మేము అటెండ్ అవుతాం కానీ కేవలం వర్చువల్ గానే అని చెప్పి షాక్ ఇచ్చింది. నేరుగా వెళ్లకుండానే మార్చి 3 నుంచి 11 తేదీల షెడ్యూల్‌కి డిజిటల్‌గా ఓకే చెప్పేశారు. విమానం ఎక్కకుండానే మీటింగ్ క్లోజ్ చేయడం చూసి పాక్ బోర్డు మెంబర్లు మైండ్ బ్లాంక్ అయ్యాయి.


**భారత్ స్పోర్ట్స్ పాలసీ:**

అసలు గొడవ లేకుండా టోర్నీలో ఆడటానికి భారత గవర్నమెంట్ దగ్గర ఒక పక్కా మాస్ రూల్ ఉంది. పాకిస్థాన్‌తో మనకి మాత్రమే డైరెక్ట్ మ్యాచ్ ఉండే అవకాశం లేదు. అదే 7–-8 దేశాలు ఉండే మల్టీ-నేషన్ టోర్నీ అయితే... ఓకే చెప్పడం మన సింపుల్ లాజిక్. ఈ సీక్రెట్ పాలసీ వల్లే పాక్ టీమ్‌లు భారతదేశానికి రావడం, మనోళ్లు ఐసీసీ లేదా ఇలాంటి సౌత్ ఏషియన్ గేమ్స్ టోర్నీల్లో వాళ్లతో ఆడటం జరుగుతోంది. కాబట్టి 7 దేశాల ఈ ఈవెంట్‌లో ఇండియా ఆడటం పక్కా స్కెచ్‌లాగే అనిపిస్తోంది.

**అంతిమ నిర్ణయం మోడీ సర్కార్‌దే:**

అయితే ఇప్పుడున్న అసలైన సస్పెన్స్ ఏంటంటే.. పాకిస్థాన్ మీడియా ఎంత ఎగిరి గంతేసినా, అంతిమ నిర్ణయం మాత్రం భారత ప్రభుత్వం చేతిలోనే ఉంది. సెక్యూరిటీ వైబ్స్ సరిగ్గా లేకపోతే చివరి నిమిషంలో మనోళ్లు యూ-టర్న్ తీసుకునే ఛాన్స్ కూడా లేకపోలేదు. ఒకవేళ గ్రీన్ సిగ్నల్ వస్తే మాత్రం నీరజ్ చోప్రా విసిరే ఈటె పాకిస్థాన్ గ్రౌండ్లలో ల్యాండ్ అయి కొత్త రికార్డులు క్రియేట్ చేయడం ఖాయం. మరి 2027 నాటికి మన ప్లేయర్లు పాకిస్థాన్ ఫ్లైట్ ఎక్కుతారో లేక వర్చువల్‌గానే గుడ్ బై చెప్తారో చూడాలి మరీ.

# తెర వెనుక కష్టానికి గాయాలే సాక్ష్యం!



డియోర్ షూస్ మరియు హౌస్ ఆఫ్ CB డ్రెస్‌లో అదితి బుధతోకి అభిమానులను ఆశ్చర్యపరిచింది







రెయిన్‌బో హార్ట్ మరియు సాల్టీ హెయిర్‌తో కృతి సనన్ వైబ్రెంట్ వెకేషన్ వైబ్స్

సినిమా రంగంలో తెరపై కనిపించే నటీనటుల మెరుపులు, గ్లామర్ వెనుక ఎన్నో కఠిన శ్రమ, ప్రాణాలను పణంగా పెట్టే సాహసాలు దాగి ఉంటాయి. ఇటీవల కాలంలో బాలీవుడ్ .. సౌత్ చిత్ర పరిశ్రమలకు చెందిన పలువురు ప్రముఖ నటీనటులు షూటింగ్‌ల సమయంలో తీవ్రమైన గాయాల బారిన పడుతున్నారు. కార్తీక్ ఆర్యన్, నేషనల్ క్రష్ రష్మిక మందన్న, నిమ్రత్ కౌర్ అహ్లువాలియా వంటి స్టార్లు వరుసగా ఇంజూరీస్ ఎదుర్కొంటున్న ఘటనలు చర్చనీ యాంశంగా మారుతున్నాయి.

యువ హీరో కార్తీక్ ఆర్యన్ నెక్స్ట్ ప్రాజెక్ట్ షూటింగ్‌లో భాగంగా యాక్షన్ సన్నివేశాల్లో పాల్గొంటుండగా గాయపడ్డారు. ప్రమాదకరమైన విన్సెంట్లు .. స్టంట్స్ చేసే సమయంలో ఆయనకు స్వల్ప గాయాలైనట్లు తెలిసింది. అయి నప్పటికీ అంకితభావంతో షూటింగ్‌ను కొనసాగించిన కార్తీక్ తెగువను అభిమానులు ప్రశంసిస్తున్నారు. గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా మాస్ యాక్షన్ సినిమాల వైపు అడుగులు వేస్తున్న తరుణంలో ఈ తరహా గాయాలు సర్వ సాధారణంగా మారుతున్నాయి.మరోవైపు బిజీ షెడ్యూల్స్ మధ్య శ్రమిస్తున్న నటి రష్మిక మందన్న కూడా ఇటీవల షూటింగ్‌లో గాయపడ్డారు.

నిరంతర ప్రయాణాలు, భారీ బడ్జెట్ చిత్రాల షూటింగ్‌లతో తీరికలేకుండా గడుపుతున్న భామ శారీరక ఒత్తిడి , రిస్కీ సీన్ల కారణంగా స్వల్ప గాయాలను ఎదుర్కొన్నారు. ఆరోగ్యాన్ని సైతం లెక్కచేయకుండా సినిమా కోసం పడుతున్న కష్టాన్ని చూసి అభిమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.టెలివిజన్ నుంచి సినిమాలకు ఎదిగిన నిమ్రత్ కౌర్ అహ్లువాలియా వంటి నటీమణులు కూడా ఇటీవల ఫిట్‌నెస్ సెషన్స్ .. షూటింగ్ స్పాట్లలో గాయాలపాలయ్యారు.ఈ ఘటనలన్నీ సెలబ్రిటీల దైనందిన జీవితంలో ఫిట్‌నెస్, యాక్షన్ ఎంతటి రిస్క్‌తో కూడుకున్నవో తెలియజేస్తున్నాయి. ఎంతో మందికి స్ఫూర్తిగా నిలిచే స్టార్లు తెరవెనుక పడుతున్న శ్రమకు ఈ గాయాలే ప్రత్యక్ష సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. ఇండస్ట్రీలో హై-ఆక్టేన్ యాక్షన్ సీక్వెన్స్‌లకు మారుతున్న ట్రెండ్, విజువల్ వండర్స్ కోసం మేకర్స్ చేస్తున్న ప్రయత్నాలు నటీనటుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. బాడీ డబుల్స్ కాకుండా నటీనటులే స్వయంగా సాహసాలు చేయడానికి ముందుకు రావడం వల్ల ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయి. అయితే దర్శక నిర్మాతలు తగు జాగ్రత్తలు తీసుకుంటున్నా? చిన్న పాటి తప్పిదాలు కారణంగా గాయాలు తప్పడం లేదు.

గ్లామర్ ప్రపంచం వెనుక కష్టాల గురించి వరుస గాయాలు మరోసారి కళ్లకు కడుతున్నాయి. ఎన్నో ఇబ్బందులను, నొప్పులను భరించి ప్రేక్షకుల ముందుకు వచ్చి అలరిస్తున్న నటీనటుల నిబద్ధతను అంతా అభినందించాల్సిం దే. గాయాల నుంచి కోలుకుని మరింత ఉత్సాహంగా ప్రేక్షకుల ముందుకు రావడానికి నటీనటులు అంతే ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2230, editorpenpower@gmail.com